హైదరాబాద్ వార్త

సన్ స్ట్రోక్..



-ఉష్ణోగ్రతలతోపాటే పెరుగుతున్న జ్వరాలు
-తలనొప్పి, కండరాల నొప్పి ..నాలుకతడి ఆరిపోవడం
-డయేరియా,వాంతుల లక్షణాలతో బాట
-ప్రభుత్వ ,ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెరుగుతున్న బాధితులు
-బయట తిరిగేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

హైదరాబాద్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త:

ఎండలు ప్రజల్ని అల్లాడిస్తున్నాయి. ఉన్నట్లుండి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ఎటు చూసినా వైరల్ జ్వరాల బాధితులు కనిపిస్తున్నారు. వాంతులు, విరేచనాలు, ఒళ్లునొప్పుల వంటి లక్షణాలతో సతమతమవుతున్నారు. ఒక్కో క్లినిక్ వద్ద 50మందికి పైగా జ్వరపీడితులు ఉంటున్నట్లు తెలుపుతున్నారు. ఫీవర్ ఆస్పత్రికి కూడా కొద్ది రోజులుగా ఔట్ పేషెంట్ (ఓపి) కూడా పెరుగుతుంది. కార్పొరేట్ ,ప్రైవేట్ ఆస్పత్రులల్లో ఒకేసారి కనీసం అయిదారుగురు బాదితుల్ని చూస్తున్నామని చెబుతున్నారు. కండరాలు పట్టేయడం, సొమ్మసిల్లడం, నీరసించిపోవడం, చెమటలు పట్టడం, నాలుకతడి ఆరిపోవడం, వాంతులు, వీరేచనాలు కళ్లుతిరగడం ,తలనొప్పి తదితర లక్షణాలు వీరిలో ప్రధానంగా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. ఎండలో ఎక్కువగా తిరిగేవారు ముఖ్యంగా ద్విచక్రవాహనాలపై తిరిగేవారు జ్వ

రాల బారినపడే ముప్పు ఉందని వారు వివరించారు. అలాగే పరిశుభ్రమైన నీరు తాగకపోతే ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్లే అనేది వైద్యుల మాట. ప్రధానంగా హోటళ్లు, చాట్ దుకాణాలు, బస్సు స్టేషన్‌లు, రైల్వే స్టేషన్స్ వద్ద ఏనీరు పడితే ఆఆనీరు తాగడం వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆహారం విషయంలోనూ ఆరోగ్యకరమైన పదార్థాల్ని మాత్రమే తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

ఇలా చేయండి ..

ఎక్కువగా ఇంట్లో తయారు చేసే పండ్ల రసాలు తీసుకోవాలి. నీరు గ్లూకోజ్ ,జావ ,బార్లీ ,మజ్జిగ, రాగి అంబలి, సగ్గుబియ్యంతో చేసిన పానీయాలు తీసుకోవడం మంచిది. నీటి శాతం కోల్పోతున్న వారు తాగే నీరులో ఉప్పు, పంచదార వేసుకని తాగాలి. ఉదయం 8గంటలకే బయటకు వెళ్లాలి. సాయంత్రం 6గంటల తర్వాత బయటి పనులు పూర్తి చేసుకోవాలి. ఎండల్లో తిరిగేవారు తప్పనిసరిగా గొడుగులు, టోపీలు ధరించాలి. వాంతులు ,విరేచనాలు అవుతున్నప్పటికీ ఎక్కువగా నీరు తాగిస్తూనే ఉండాలి. రోడ్లపక్కన విక్రయించే ఆహారం తినకూడదు. అపరిశుభ్రమైన నీరు తాగకపోవడం మంచింది. మాంసం,గుడ్లు, నూనె పదార్థాల జోలికి వెళ్లకూడదు.వేడిగా, తాజాగా ఉండే ఆహారం తీసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి..

ప్రధానంగా ఎండ వేడిమి, కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధులు వస్తాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. నివారణకు వైద్యులు సహాలను పాటించాలి. వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గకుండా జాగ్రత్తపడాలి. రోడ్ల పక్కన లభించే అపరిశుభ్ర ఆహార పదార్థాలను తినొద్దు. జలుబు ,తుమ్ములు , ఒళ్లునొప్పులతో మొదలయ్యే జ్వరం,. నాలుగైదు రోజులపాటు ఇబ్బంది పెడుతుంది. మరీ ఎక్కువగా ఉంటే వైద్యులని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

ఉప్పల్ స్టేడియంలో ఐపిఎల్ జోష్

-భారీగా తరలివచ్చిన ప్రేక్షకులు
: పార్కింగ్ కోసం అవస్థలు

ఉప్పల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద మంగళవారం దిల్లీ క్యాపిటల్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్ల మ్యాచ్ సందర్భంగా ప్రేక్షకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్టేడియం వద్ద శనివారం మధ్యాహ్నం నుంచే సందడి నెలకొంది. మంగళవారం సాయంత్రం 7:30 గంటలకు దిల్లీ క్యాపిటల్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. సొంతగడ్డపై వరుసగా రెండు విజయాలతో జోరుమీదున్న సన్ రైజర్స్ హైదరాబాద్ హ్యాట్రిక్ పై కన్నేసింది. ఇప్పటి వరకు 6 మ్యాచ్‌లు ఆడిన సన్ రైజర్స్ 3 విజయాలతో 6 పాయింట్లు గెలుచుకుని పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. 5 మ్యాచ్‌లలో మూడింట గెలిచిన దిల్లీ 6 పాయింట్లతో అయిదో స్థానంలో కొనసాగుతోంది. మ్యాచ్ సందర్భంగా స్టేడియం వద్ద 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 430 సీసీ కెమెరాలతో పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. మ్యాచ్ టికెట్లు ఉన్నవారు మాత్రమే స్టేడియం వద్దకు పోలీసులు అనుమతించారు. స్టేడియం బయట ప్రేక్షకులతో సందడి నెలకొంది. బయట యథేచ్ఛగా కొందరు టిక్కెట్లు విక్రయించినట్లు పలువురు ఆరోపించారు.

పార్కింగ్ కోసం అవస్థలు :

ఉప్పల్‌లోని ఐపిఎల్ క్రికెట్ సందర్భంగా పార్కింగ్ కోసం వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. స్టేడియం బయట రోడ్డు వెంట వాహనదారులు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసి వెళ్లారు. స్టేడియం చుట్టూ ప్రైవేటు స్థలాలు తీసుకున్నట్లు ప్రకటించినా పలువురు వాహనదారులు మ్యాచ్ వీక్షించేందుకు హడావిడిగా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేశారు. మెట్రో రైలు, ఆర్టీసి బస్సు సర్వీసులు ఉపయోగించుకోవాలని పోలీసులు సూచనలు చేసినా కార్లు, ద్విచక్ర వాహనాల రద్దీ అధికంగా కనిపించింది.

వాణిజ్య సంస్థలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

- ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

:మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి స్పష్టం చేశారు. 99 రోజుల కార్యాచరణ - ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా మంగళవారం హబ్సిగూడలోని స్నేహా నగర్ పార్క్, స్ట్రీట్ నెం.8 ప్రాంతం, రామంతాపూర్ చిన్న చెరువును అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు.స్నేహా నగర్ పార్క్‌లో సీనియర్ సిటిజన్లతో సమావేశమైన కమిషనర్‌కు వారు పలు సమస్యలను వివరించారు. పార్క్ నిర్వహణ నిధులను పెంచడంతో పాటు సమయానికి విడుదల చేయాలని కోరారు. అలాగే జిమ్ పరికరాల మరమ్మతులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఏరియాల అభివృద్ధి చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్‌ను సందర్శించిన కమిషనర్, గదులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాన్ని శుభ్రంగా, ఉపయోగకరంగా ఉంచాలని సూచించారు.స్నేహా నగర్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై, సభ్యుల ట్రాన్స్‌ఫర్, డిలీషన్ ప్రక్రియలపై చర్చించారు. నిబంధనల ప్రకారం సభ్యుల చేర్పు జరిగేలా మార్గదర్శకాలు అందించి, ప్రక్రియను సరళీకరించాలని అధికారులకు సూచించారు.హబ్సిగూడ స్ట్రీట్ నెం.8లోని వాణిజ్య సంస్థల్లో ట్రేడ్ లైసెన్సు లను పరిశీలించిన కమిషనర్, మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని వ్యాపారులకు సూచించారు.రామంతాపూర్ చిన్న చెరువులో లార్వా పరిస్థితిని పరిశీలించిన ఆయన, దోమల నివారణ కోసం గాంబూసియా చేపలు, ఆయిల్ బాల్స్ వినియోగం వంటి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెరువు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ పర్యటనలో ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, పారిశుధ్య సిబ్బంది, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డుల జారీ.....

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్హులైన వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డులను జారీ చేశారు.ఈ సందర్భంగా కార్పొరేషన్ వ్యాప్తంగా 17 ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, మొత్తం 168 దరఖాస్తులను స్వీకరించారు. శానిటేషన్ అదనపు కమిషనర్ సీఎన్. రఘు ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం సీనియర్ సిటిజన్‌ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి సేవలను సులభతరం చేయడానికి ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన అర్హులైన వృద్ధులు తమ ఆధార్ కార్డు, వయస్సు ధృవీకరణ పత్రాలు, చిరునామా రుజువు పత్రాలతో హాజరై నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన వారికి త్వరితగతిన కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్డుల ద్వారా సీనియర్ సిటిజన్‌లకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, రైల్వే ప్రయాణాల్లో రాయితీలు, ఔషధాలపై తగ్గింపులు వంటి పలు ప్రయోజనాలు లభిస్తాయని అధికారులు వెల్లడించారు.

జగద్గిరిగుట్ట కోనేరుకు కొత్త కళ ..

ఆక్రమణలతో పాటు పూడికను తొలగించిన హైడ్రా -22 ఏళ్ల పోరాటం ఫలించిందన్న పూజారి నరహరి

హైదరాబాద్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:

అనేక దేవాలయాలకు కొలువై ఉన్న జగద్గిరిగుట్ట ఉన్న కోనేరు(గుండం) కబ్జాకు గురౌతోందని.. కాపాడాలని అక్కడి గోవిందరాజుల స్వామి ఆలయ పూజారి నరహరి రోధిస్తూ వేడుకున్న వీడియో అందరికీ గుర్తే ఉంటుంది. సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైన వీడియోను చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోనేరు పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.. ఈ మేరకు మంగళవారం కోనేరు ఆక్రమణలను హైడ్రా తొలగించింది. అందులో పేరుకుపోయిన పూడికను తరలించింది. దాదాపు 26 ట్రక్కుల వరకూ ఉన్న నిర్మాణ వ్యర్థాలు, చెత్త, చెదారాన్ని తొలగించి కోనేరుకు కొత్త కళను అందించింది. ఒక ఎకరా వరకూ ఉన్న కోనేరును ఆక్రమించి మట్టితో నింపి.. పార్కింగ్ కోసం అక్కడి వారు వినియోగించుకుంటున్నారు. ఇలా మొత్తం కోనేరునే కబ్జా చేయాలనుకునే ప్రయత్నాలకు హైడ్రా చెక్ పెట్టింది. ఆ కోనేరు పునరుద్ధరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. దీంతో స్థానికులతో పాటు.. ఆలయ భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆలయ పూజారి గోవిందరాజుల స్వామి మాట్లాడుతూ 22 ఏళ్ల పోరాటం ఫలించిందని అన్నారు. కోనేరును చూడకుండానే జీవితం అంతమోతుందేమో అని ఆందోళన చెందానని ఇప్పుడు హైడ్రా రూపంలో ఆ భగవంతుడే.. కోనేరు పరిరక్షణకు చర్యలు తీసుకున్నారన్నారు. హైడ్రాను ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి.. కబ్జాలను తొలగించిన హైడ్రా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం, హనుమాన్ దేవాలయం, జగద్గిరిగుట్ట గోవిందరాజుల స్వామి ఆలయం, పోచమ్మ టెంపుల్, వాసవి కనకపరమేశ్వరి ఆలయం, నల్ల పోచమ్మ ఆలయం, శివాలయం, పరశురామాలయం, అయ్యప్పస్వామి ఆలయం ఇలా దేవదేవతలు కొలువైన జగద్గిరి గుట్ట నగర ప్రజలందరికీ సుపరిచితమే. ఇలాంటి చరిత్ర ఉన్న ఆలయ భూములను, కోనేరును కాపాడం ఎంతో శుభ పరిణామం అని అన్నారు. వర్షాలు పడినప్పుడు గుట్టపైనుంచి వచ్చే నీరు అందులో చేరుతుందని.. బోర్లు వేసి అయినా నీటితో కోనేరును నింపుతామని పూజారి నరహరి చెప్పారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త:

మైనార్టీ యువత ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు.మంగళ వారం ఉర్దూ మస్కన్ ఆడిటోరియం ఖిల్వత్ నందు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మైనార్టీ యువతకు సంక్షేమ పథకాల అవగాహన సదస్సుకు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కోత్వాల్, చార్మినార్ శాసనసభ్యులు మీర్ జుల్ఫేఖర్ అలీ తో కలసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు సరైన నైపుణ్యాభివృద్ధి అందినప్పుడే వివిధ రంగాలలో రాణించటం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు. అలాగే మే 28న పెద్ద ఎత్తున లోన్ మేళాను ఏర్పాటు చేయటం జరుగుతుందని అన్ని బ్యాంకులకు సంబంధించిన బ్యాంక్ అధికారులు అందుబాటులో ఉంటారని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా తెలంగాణ ఇండస్ట్రీస్, పిఎంఈజీఏ, ఎంఎస్ఉం ఈ అలాగే మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ స్కీములపై జిల్లాలో యువతకు అనేక శిక్షణ సదస్సులు ఏర్పాటు చేసి వివిధ రంగాలలో రాణించేలా ప్రత్యేక తర్ఫీద్ అందించడం జరిగిందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యొక్క అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయని అర్హులైన యువత అందరూ పూర్తిస్థాయి నైపుణ్యాభివృద్ధి పొంది పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఇలియాస్ అహ్మద్, పరిశ్రమల శాఖ జిఎం పవన్ కుమార్, జనరల్ మేనేజర్ అబ్దుల్ హమీద్, తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ గ్యాంగ్ అరెస్ట్ .. బంగారం, బైకులు స్వాధీనం

తార్నాక, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :

ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు వేగంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి సుమారు 3.5 తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.... ఏప్రిల్ 17న హబ్సిగూడలో ఉదయం పాల ప్యాకెట్ కోసం వెళ్లిన వృద్ధ మహిళపై ఇద్దరు వ్యక్తులు బైక్ పై వచ్చి ఆమె మెడలోని సుమారు 5 తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఒ.యూ పోలీసులు కేసును సంయుక్తంగా స్వల్ప వ్యవదిలోనే ఛేదించారు. దర్యాప్తులో భాగంగా పుల్లిపాటి హేమంత్ కుమార్ అలియాస్ నాను (25) పల్లె దీపక్ (25) మాల్ శంకూరియా (20) అనే ముగ్గురు నిందితులను గుర్తించి ఏప్రిల్ 20న అరెస్ట్ చేశారు. హేమంత్, దీపక్‌లు పాత నేరస్థులు. మరో నిందితుడు కందుకూరి రామచారి అనే బంగారు కార్మికుడికి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున అంబర్‌పేట నుంచి బయలుదేరిన నిందితులు హబ్సిగూడలోని కరూర్ వైశ్యా బ్యాంక్ సమీపంలో ఓ మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును గమనించారు. దీపక్ బైక్ నడుపుతుండగా, హేమంత్, శంకరియ కలిసి గొలుసును లాక్కొని పరారయ్యారు. అనంతరం దానిని ముక్కలుగా చేసి పంచుకుని, కొంత డబ్బుతో కొత్త బైక్ కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.ఈ ఆపరేషన్‌ను టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జె. రాజశేఖర్, ఓయూ సిటీ ఎస్‌హెచ్ఓ ఎం. మహేష్ ఆధ్వర్యంలో డిఐ లెనిన్ బాబు, ఎస్సైలు బి. మహేష్, కె. కరుణాకర్ రెడ్డి, ఎస్. రాజు, డి. కృష్ణ తదితరులు విజయవంతంగా నిర్వహించారు.

రీల్స్ కోసం ప్రమాదకర స్టంట్లు..బాలుడు మృతి

నాచారం. ఏప్రిల్ 21 ప్రభాతవార్త : సోషల్ మీడియాలో రీల్స్ తీసే క్రమంలో ప్రమాదకర స్టంట్ చేయడంతో ఓ బాలుడు ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మల్లాపూర్ నోమ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఓల్డ్ మల్లాపూర్‌లో నివసిస్తున్న బీహార్‌కు చెందిన సికిందర్ కుమార్ కుమారుడు నితిన్ కుమార్ (14) స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల తన స్నేహితులతో కలిసి ఇంటి మూడో అంతస్తుపై రీల్స్ చిత్రీకరిస్తుండగా ఈ ఘటన జరిగింది. రీల్ కోసం బాల్కనీ రైలింగ్‌పై నడుస్తూ వీడియో తీయాలని స్నేహితులను కోరిన నితిన్, స్టంట్ చేస్తున్న సమయంలో అదుపు తప్పి మూడో అంతస్తు నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు వెంటనే యశోద హాస్పిటల్కు తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మైహెల్త్ ఆసుపత్రి, చివరకు నిమ్స్ ఆసుపత్రికి మార్చగా, చికిత్స పొందుతూ ఈ నెల 18న సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో మరోసారి రీల్స్ కోసం ప్రమాదకర స్టంట్లకు పాల్పడకూడదని పోలీసులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలపై పర్యవేక్షణ పెంచాలని సూచిస్తున్నారు.

పెద్దలను స్మరించుట మన కర్తవ్యం

- రామానుజ జీయర్ స్వామి

గన్‌ఫౌండ్రి,ఏప్రిల్ 21ప్రభాతవార్త:

పెద్దలను స్మరించుట మన కర్తవ్యమని వేదాంత దేశికుల సంస్కృత కృతులకు తెలుగులో వ్యాఖ్యాన గ్రంథాలను రచించిన శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామి చిరస్మరణీయులని పరమహంస పరవహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ దేవనాథరామానుజ జీయర్ స్వామి ప్రస్తావించారు.సాధన సాహితీ స్రవంతి,తిరుమల,చారిటబుల్‌ట్రస్ట్‌సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడిన పురస్కారాల ప్రధాన సభలో త్రిదండి దేవనాథరామానుజ జీయర్ స్వామి ముఖ్యఅతిథిగా విచ్చేసి,పురస్కార ప్రధాతగా పాల్గొన్ని ప్రసంగించారు.ఈసమావేశంలో జీయర్ స్వామి కరకమాలాల మీదుగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు,విశ్రాంత(ఐ.ఎ.ఎస్)అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి తండ్రిగారైన ఉభయ వేదాంత ప్రచారకులు,శ్రీమాన్ కె.వి.రాఘవాచార్య స్మారక పండిత పురస్కారాన్ని హిందు ధర్మ ప్రచార పరిషత్ పూర్వకార్యదర్శి ఉ.వే.చిలకపాటి విజయరాఘవచార్యకు స్ఫూర్తి పురస్కారాన్ని యువ అష్టావధాని ఆవునుల భానుప్రకాష్‌కు అందచేశారు.డాక్టర్ కె.వి.రమణాచారి స్వాగతోపన్యాసం చేస్తూ కనిపెంచిన తల్లిదండ్రులు కనిపించే దైవాలని పేర్కొన్నారు.కండ్లకుంట యాదగిరాచార్య అధ్యక్షత వహించిన ఈ సభలో ఆచార్యా కసిరెడ్డి వెంకట్‌రెడ్డి చిలకమర్రి,లక్ష్మినాథాచార్య, మరుమాముల దత్తాత్రేయశర్మ,విశిష్ట అధితులుగా పాల్గొన్నారు.పురస్కార స్వీకర్తల స్పందనతో సభ ముగిసింది.కాగా సభా కార్యక్రమానికి ముందు వికాస తరంగిణి-కవాడిగూడకు చెందిన మహిళమణులు వసుంధర నేతృత్వంలో విష్ణు సహస్రనామ పారాయణం చేసి సభా మంటపంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.అంతకు ముందు ప్రముఖ కవి.డాక్టర్ ఆచార్య వేణు అధ్యక్షతనజరిగిన కవి సమ్మేళనంలో పితృదేవోభవ అన్న అంశంపై ప్రముఖకవులు అర్థమైన కవితలనుచదవి శ్రోతలను ఆలపించారు.పలువురు,కవులు,పండితులు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్న ఈ సభకు సాధన సాహితీ స్రవంతి అధ్యక్షులుగా సాధన నరసింహాచార్య సమన్వయకర్తగా వ్యవహరించారు.

ప్రేమ వ్యవహారం..
పురుగుల మందు తాగి ఒకరి మృతి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః

ఖైరతాబాద్ పరిధిలో ఒక యువకుడు గుర్తుతెలియని విషం సేవించి అక్కడికక్కడే మృతిచెందగా, యువతి అపస్మారక స్థితికి చేరి ఆసుపత్రి పాలైంది. ఖైరతాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. ప్రేమ్ నగర్‌లోని డెక్కన్ చర్చ్ సమీపంలో ఓ యువకుడు విషం సేవించినట్లు మంగళవారం తెల్లవారుజామున పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సోను అనే మహిళ అపస్మారక స్థితిలో కనిపించగా, బండపల్లి అమర్ అనే యువకుడు మృతిచెంది కనిపించాడు. అమర్, సోను గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నట్లు మృతుడి సోదరుడు అరుణ్‌కుమార్ పోలీసుల దృష్టికి తీసుకొచ్చాడు. అంతేకాకుండా అమర్ అయిదు రోజులుగా ఇంటికి రాలేదని, యువతితోనే కలిసి ఉన్నాడని పోలీసులకు తెలిపాడు. సోను తనకు ఫోన్ చేసిందని, అమర్ ఏదో సేవించి, అసాధారణంగా ప్రవర్తిస్తున్నాడని ఫోన్‌లో చెప్పడంతో అరుణ్ వెంటనే చింతల్ నుంచి బయలుదేరి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వమని సూచించాడు. ఘటన స్థలానికి చేరుకునేలోపే అమర్ మృతి చెందినట్లు అంబులెన్స్ సిబ్బంది నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా సోనికి పెళ్లై ఇద్దరు పిల్లలున్నారు. మాదాపూర్ ప్రాంతంలో పనిచేసే సమయంలో వీరి మధ్య పరిచయం ఏర్పడినట్లు పోలీసులు గుర్తించారు. కాగా అమర్ పురుగుల మందు సేవించడం వల్ల మృతిచెందినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానిస్తున్నప్పటికి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

పారిశుధ్యం విభాగం అధికారుల అవినీతి లీలలు

-।అధ్వానపు పారిశుధ్యంతో ప్రజలు అవస్థలు

కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త : కూకట్‌పల్లి జోన్ పరిధిలోని కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీ, మూసాపేట్ సర్కిళ్లలో పారిశుద్ధ్య విభాగం పనితీరుపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులు పర్యవేక్షణను పక్కనపెట్టి, నెలవారీ మామూళ్లకే పరిమితమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం కారణంగా పలు ప్రాంతాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోతుండగా, కాలనీలు, బస్తీలు అధ్వాన్న పరిస్థితులకు చేరుకున్నాయి. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకు పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతూ సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారుల అండతో కొన్ని ప్రాంతాల్లో బోగస్ పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

25న గన్‌ఫౌండ్రిలో హిందు సమ్మేళనం...

హిందు సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బిజెపి నాయకులు ఓంప్రకాష్‌బిస్వా తదితరులు

గన్‌ఫౌండ్రి, ఏప్రిల్ 21ప్రభాతవార్త: మారుతున్న కాలానికి అనుగుణంగా సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం, భాద్యత ప్రతి ఒక హిందుపై ఉందని తెలంగాణ బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వా పిలుపు నిచ్చారు. హిందు ధర్మ పరిరక్షణలో భాగంగా ఈనెల 25వతేదిన గన్‌ఫౌండ్రి సమీపంలో అనుజ టవర్స్ వద్ద భారీ హిందు సమ్మేళన బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 5గంటలకు జరిగే హిందు సమ్మేళనం బహిరంగ సభకుముఖ్యవక్తలుగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత సహ్ ఏర్ర నర్సింగ్‌జి, రాష్ట్రీయసేవిక సమితి భాగ్యనగర్ సంబాగ ప్రచారిక జానకి వ్యాసజీలు పాల్గొన్ని ప్రసంగిస్తారన్నారు. హిందు సమ్మేళనం కార్యక్రమంలో పెద్ద ఎత్తున్న హిందువులు పాల్గొనవల్సిందిగా కోరారు.

చిన్నబజార్‌లో సర్ కొనసాగింపు..

ఓటర్ల జాబితాల సవరణ పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 21ప్రభాతవార్త: ఓటుహక్కు ప్రతి ఒకరు భాధ్యతగా భావించి, అంతేకాకుండా ప్రత్యేకంగా ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమాన్ని పురానాపూల్ డివిజన్‌లోశ్రీకారం చుట్టారు. డివిజన్ పరిధిలోని 15వ బూత్ వద్ద ఎస్.ఐ.ఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)నిర్వహించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ సున్నంరాజ్ మోహన్ పర్యవేక్షణలో మజ్లీస్ క్రీయాశీలసభ్యులు అమ్జద్‌ఖాద్రి 15వ పోలింగ్ బూత్‌వద్ద ప్రత్యేక విస్తృత పునశ్చరణ(సర్)పనిని చేపట్టారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ మజ్లీస్ అధినేత, పార్లమెంట్‌సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, చార్మినార్ శాసనసభ్యులు మీర్ జుల్ఫికర్ అలీ సూచనల మేరకు పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

పహల్గామ్ దాడిని దేశం ఇంకా మర్చిపోలేదు

:ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి డాక్టర్ సుధాకర్

హైదరాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

పహల్గామ్ దాడి జరిగి ఏడాది గడచిన సందర్భంగా ఆమ్ ఆద్మీ ప్రధాన అధికార ప్రతినిధి డాక్టర్ దిడ్డి సుధాకర్ మంగళవారం లిబర్టీలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. గత సంవత్సరం ఏప్రిల్ నెలలో జమ్మూ కశ్మీర్‌లోని పహెల్గాంలో జరిగిన ఉగ్రదాడి దేశాన్ని తీవ్రంగా కుదిపేసింది. అమాయక భారతీయులపై జరిగిన ఈ మారణ కాండను దేశం ఇంకా మర్చిపోలేదు. బాధిత కుటుంబాల కళ్లలో కన్నీళ్లు ఇంకా ఆరలేదు. టెర్రరిస్టులు ఎక్కడ? కేంద్రానికి సమాధానం ఉందా? ఈ దాడికి బాధ్యులైన ఉగ్రవాదులను ఇప్పటి వరకు పట్టుకోలేకపోవడం కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యం. వారు వందల కిలోమీటర్లు దాటి ఎలా వచ్చారు? ఎలా పారిపోయారు? ఇప్పటి వరకు ఒక్క నిందితుడిని కూడా పట్టుకోకపోవడానికి కారణం ఏమిటి? ప్రభుత్వం వారిని చంపేస్తాం అని చెపుతున్నా..చంపినట్లు ఆధారాలు చూపలేదు"అన్నారు. ఆపరేషన్ సింధూర్ మొదలు పెట్టి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కనుసైగలతో యుద్ధాన్ని ఆపేసిన మోడీ తన మనకిబాత్‌లో పివోకెను స్వాదీనం చేసుకోకుండా యుద్ధం ఎందుకు ఆపారో సమాధానం చేప్పాలని డిమాండ్ చేశారు. '2019లో పుల్వమాలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన ఘటన కూడా దేశానికి గుర్తుంది. ఆ ఘటనలో కూడా ఇప్పటికి నిజాలు వెలుగులోకి రాలేదు. దేశానికి ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. భద్రతా లోపాలపై పారదర్శక నివేదిక విడుదల చేయాలి. ఉగ్రదాడులను రాజకీయ లాభాల కోసం వినియోగించడం ఆపాలి. దేశ భద్రతపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలి. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన అమాయక పౌరులు, వీర జవాన్లకు మా ఘన నివాళులు. వారి త్యాగం ఎప్పటికీ వృథా కావద్దు'అని డాక్టర్ దిడ్డి సుధాకర్ పేర్కొన్నారు.

వైభవంగా భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :

రాజశ్యామల అమ్మవారికి, సువర్ణ లింగానికి అభిషేకం చేస్తున్న డీఎస్పీ రుద్ర భాస్కర్ దంపతులు

చాంద్రాయణగుట్ట కేశవగిరిపై గల శ్రీ భ్రమరాంబదేవి సమేత శ్రీ చెన్నమల్లిఖార్జున స్వామి దేవస్థానం ఆవరణలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం ఐదవ వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. వేద పండితులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగ వ్యారాధన, మండపపూజ, సహస్ర లింగార్చన, గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్రహోమాన్ని, అత్యంత శక్తివంతమైన రాజ శ్యామల యాగాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. 13 మంది భక్తులు కలిసి అందించిన సువర్ణ శివలింగానికి విశేష ద్రవ్యాలతో అభిషేక ములు (ఏకాదశ రుద్ర వారాభిషేకాలు), అలంకరణ, బహువిధ పుష్పపూజ, నీరాజన వంటి విశేష పూజలు చేపట్టారు. సాయం త్రం అందంగా తీర్చిదిద్దిన మండపంలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి కళ్యాణోత్సవం మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల మధ్య నేత్రపర్వంగా జరిగింది. ఇంటలెజెన్స్ డీఎస్పీ రుద్ర భాస్కర్ దంపతులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు స్వా మివార్ల కల్యాణ మహోత్సవంలో పాల్గొని క్రతువును నిర్వహిం చారు. రాత్రికి అందంగా తీర్చిదిద్దిన పల్లకిలో స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి పురవీధుల్లో ఊరేగించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అనారోగ్యంతో మృతి చెందిన గల్ఫ్ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం

గల్ఫ్‌లో చనిపోయిన మృతుని భార్యకు ఆర్థిక సహాయం చెక్కును అందిస్తున్న డా.జి.చిన్నారెడ్డి.

బేగంపేట ఏప్రిల్ 21, ప్రభాతవార్త

దుబాయ్ లో అనారోగ్యంతో కోమాలో ఉన్న జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామినికి చెందిన ఆరెల్లి గంగారాజం అనే గల్ఫ్ కార్మికునికి మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా 10రోజుల తర్వాత అతను మృతి చెందాడు. ఈ మృతిని స్పెషల్ కేసుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిగణించి మృతుని కుటుంబానికి 5లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. చెక్కును సీఎం ప్రజావాణీ ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మృతుడు భార్య ఆరెల్లి రాజవ్వకు చెక్కును అందజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా.బి.ఎం.వినోద్‌కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, మెంబర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, ప్రవాసీ ప్రజావాణి కో ఆర్డినేటర్ బొజ్జా అమరేందర్ రెడ్డి లు పాల్గొన్నారు. ఆరెల్లి గంగారాజం(61) కిడ్నీ సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురై 2025నవంబరు 12న దుబాయ్‌లోని ఆస్టర్ హాస్పిటల్‌లో కోమాలోకి వెళ్లారు. మెరుగైన చికిత్స కోసం డిసెంబరు 14న హైదరాబాద్ తరలించి నిమ్స్‌లో చేర్చారు. అనంతరం జగిత్యాల రిహాబిలిటేషన్ సెంటర్ లో చికిత్స పొంది చివరకు జగిత్యాల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డిసెంబరు 24న మరణించారు. జీఓ నెం 216ప్రకారం గల్ఫ్ దేశాల్లో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ5లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తుంది. అయితే ఈ కేసులో మరణం భారత్‌లో చోటు చేసుకోవడంతో మరణ స్థలం గల్ఫ్ దేశం అయిఉండాలి అనే సాంకేతిక నిబంధన కారణంగా ఆర్థిక సహాయం పొందడంలో ఆటంకం ఏర్పడింది. స్పెషల్ కేసుగా గుర్తించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ఆ కుటుంబాన్ని 5లక్షలు అందజేసి ఆదుకున్నారు. మార్చి 31న ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణీలో మృతుని కుమారుడు జలంధర్, రాజవ్వలు దరఖాస్తు సమర్పించగా సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేసారు. ఈ సందర్బంగా గల్ఫ్ కార్మిక కుటుంబాలను మానవతా దృక్పథంతో ఆదుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డా.మాకునూరి సంజయ్ కుమార్, అధికార యంత్రాంగానికి పొలాస సర్పంచ్ మిల్కూరి శంకరయ్య, డీసీసీ అధ్యక్షులు గాజెంగి నందయ్య, మృతుని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేసారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యం : అరవింద్ కుమార్ యాదవ్

పోషణ్ పక్వాడా కార్యక్రమం లో పాల్గొన్న తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్ యాదవ్

చిక్కడపల్లి ఏప్రిల్ 21 (ప్రభాతవార్త) : ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ లో స్థానిక గిరినగర్ కమ్యూనిటీ హాల్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, లక్ష్మీ ్మ గణపతి దేవాలయ ఛైర్మన్ మారిశెట్టి నర్సింగ్ రావు ఆధ్వర్యంలో గర్భిణీలకు, బాలింతలకు పోషక విలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఖిపోషణ్ పక్వాడాఖి కార్యక్రమం జరిగింది. అరవింద్ కుమార్ యాదవ్ మా ట్లాడుతూ పోషకాహార లోపం లేని సమాజాన్ని నిర్మించ డం మనందరి బాధ్యత అని, చిన్నారుల భవిష్యత్తుకు పౌష్టికాహారమే పునాది అని, గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్లనే ఆరోగ్యవంతులైన చిన్నారులు జన్మిస్తారన్నారు. దేశ భవిష్యత్తు నేటి బాలల పైనే ఆధారపడి ఉంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం పౌష్టికాహారం విషయంలో ప్రత్యే క శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఆ దిశలో అంగన్‌వాడీ టీచర్లు క్షేత్రస్థాయిలో చేస్తున్న సేవలు అభినందనీయమ న్నారు. అనంతరం పౌష్టికాహారంతో కూడిన కిట్లను లబ్ధి దారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, నేతలు సాయికీర్త్ (బాబ్జి), నరేందర్, దేవీ, వరప్రసాద్, సాయిరాం, సురేందర్, వందిత్, భాస్కర్ మరియు పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్‌లు తక్షణమే అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న వి.సంధ్య

సైఫాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: మహిళా రిజర్వేషన్‌లను నియోజకవర్గాల పునర్విభజన లెక్కింపుతో ముడి పెట్టకుండా తక్షణమే అమలు చేయాలని పిఓడబ్ల్యూ, పిఎంఎస్, ఐజెఎం డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ జి.ఝాన్సీ, జాతీయ నాయకురాలు వి.సంధ్య, రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, ప్రధాన కార్యదర్శి మంగ మాట్లాడుతూ మహిళలు దశాబ్దాలు తరబడి మహిళా రిజర్వేషన్‌ల కోసం పోరాడుతున్నారని, మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి మూడు దశాబ్దాలు గడిచిందని, బిల్లు కోసం అనేక ఉద్యమాలు కొనసాగాయని, అయితే మరోసారి పార్లమెంట్‌లో బిజెపి బిల్లు పెట్టి విగిపోయేలా చేసిందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ హామీ ఇస్తూ అధికారంలోకి వచ్చిన బిజెపి తిరిగి అధికారం పొందడానికి 2023లో నారీశక్తి వందన్ అధినేయం పేరుతో చట్టం తెచ్చిందని, దీన్ని అమలు చేయకుండా జనాభా లెక్కలతో ముడిపెట్టి 2029లో అమలు చేస్తామని ప్రకటించిందన్నారు. తిరిగి ఇప్పుడు అమలు చేయడానికి నియోజకవర్గాల పునర్విభజన పేరుతో ముడిపెడుతూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టిందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కాకుండా బిజెపి చేస్తున్న కుటిల ప్రయత్నాలను వారు తీవ్రంగా ఖండించారు. మహిళా సాధికారతకు చిత్తశుద్ధితో పారదర్శక కార్యాచరణ తక్షణమే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

దేవరకొండ బస్తీలో ప్రారంభమైన నాలా పనులు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః

బంజారాహిల్స్‌లోని దేవరకొండ బస్తీలో నాలా పనులు ప్రారంభమయ్యాయి. నాలా పనులు ప్రారంభించిన గుత్తేదారు కాలువలను తీసి పనులు నిలిపివేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాలాలపై కర్రలు వేసుకొని దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా మంది బస్తీవాసులు ఇళ్ల ముందు కాలువ తవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాజాగా ఈ దైన్య పరిస్థితిపై 'దారి ఇలా.. దాటెదెలా..!' అంటూ ప్రభాతవార్తలో వార్త సైతం ప్రచురతమైంది. దేవరకొండ బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పనులను ప్రారంభించాలని సూచించారు. దీంతో అధికారులు పనులను తిరిగి ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు వెంకటేశ్వర కాలనీ డివిజన్ అధ్యక్షుడు రాములుచౌహాన్, అక్బర్, మసూద్, రషీద్, మహమూద్, ఆంటోనిలతోపాటు జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగ ఏఈ మోహన్‌రావుతో కలిసి పనులను పరిశీలించారు. పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని రాములు చౌహాన్ తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం - ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

బాల్య వివాహాల నిర్మూలనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు, నిర్వాహకులు

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త : బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని, వాటిని ప్రోత్సహిస్తే మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుందని ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ బి.కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఆశ్రిత సంస్థ ఆధ్వర్యంలో అలియాబాద్ శారదా హై స్కూల్లో అక్షయ తృతీయ బాల్య వివాహ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు, ఉపాధ్యాయులతో కలిసి బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహం చేయరాదన్నారు. చట్ట ప్రకారం బాల్య వివాహం జరిపించినా, ప్రోత్సహించినా జైలుశిక్ష, జరిమాన విధిస్తారని వివరించారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. బాల్య వివాహాల వల్ల చదువు, ఆరోగ్యం నష్టపోతారన్నారు. అనంతరం విద్యార్థులచే బాల్య వివాహ నిర్మూలనా ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు పద్మ, ఆశ్రిత సంస్థ ప్రతినిధులు మమత, వీరబాబు, మాధవి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ కార్డులు అందజేత

సీనియర్ సిటిజన్ కార్డులు అందజేస్తున్న డీసీ జ్యోతి

సికింద్రాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:

వృద్ధులకు అవసరమైన సేవలను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా తార్నాక సర్కిల్ పరిధిలోని బౌద్ధనగర్లో సీనియర్ సిటిజన్ కార్డుల జారీ కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించామని జీహెచ్ఎంసీ తార్నాక సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎంఎన్ఆర్. జ్యోతి తెలిపారు. బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిబిరానికి వృద్ధుల నుండి మంచి స్పందన లభించిందని తెలిపారు. సీనియర్ సిటిజన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుని, సులభంగా పొందేందుకు వారు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని వివించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ప్రక్రియ కొనసాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూనిటీ ఆర్గనైజర్ వరుణ తదితరులు పాల్గొన్నారు.

శృంగేరి శంకర మఠంలో శంకర జయంతి వేడుకలు

నల్లకుంటలోని శృంగేరి శంకర మఠంలో శంకర జయంతి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి ఏప్రిల్ 21 (ప్రభాతవార్త) : నల్లకుంటలోని శ్రీ శృంగేరి శంకర మఠంలో శ్రీ శంకర జయంతి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా హర్యానా గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ మఠాన్ని సందర్శించి, ఆది శంకరాచార్యుల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మానికి ఆది శంకరాచార్యుల బోధనలు దిక్సూచిగా నిలిచాయని కొనియాడారు. సమాజంలో శాంతి, ఐక్యత వెల్లివిరియాలన్నా, ఆధ్యాత్మిక విలువలు పెంపొందాలన్నా శంకర భగవత్పాదుల సందేశాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాశం సాయికృష్ణ యాదవ్, కౌండిన్య ప్రసాద్‌తో పాటు మఠం నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర : వేముల రామకృష్ణ

యూనివర్సిటీల విద్యార్థి సంఘాల ప్రతినిధుల సమావేశంలో విద్యార్థి జేఏసి చైర్మన్ వేముల రామకృష్ణ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త

ఫీజు రియంబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్రను మానుకోవాలని తెలంగాణ విద్యార్థి జేఏసి చైర్మన్ వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం అఖిలపక్ష యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజులు కట్టలేక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఫీజుల పోరుకు అన్ని యూనివర్సిటీల విద్యార్థి సంఘాలు ఐక్యం ఉద్యమానికి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. 'కళాశాలలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తాం అంటున్నారు, ఫీజులు కట్టలేక ఉన్నత చదువులు, ఉద్యోగాలు వదులుకుంటున్నారు. కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బీటెక్ చదువుతున్న ప్రణీత్ అనే విద్యార్థి, కాలేజీ యాజమాన్యం ఫీజుల కోసం ఒత్తిడి చేయడంతో అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకోవడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం భారత అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. దగ్గర మంత్రులు, ఎమ్మెల్యేలు, చైర్మన్లు భారీ జీతాలకు, అలవెన్సులకు, హెలికాప్టర్ ప్రయాణాలకు, సంబరాలకు, మూసి సుందరీకరణలకు మాత్రం నిధులు వెచ్చిస్తున్న ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుకుంటామంటే ఫీజులకు డబ్బులు లేవంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉమేష్ (వెటర్నర్ యూనివర్సిటీ), వంశీ (అగ్రికల్చర్ యూనివర్సిటీ), సంజయ్ (ఉస్మానియా యూనివర్సిటీ), పాపారావు(తెలంగాణ యూనివర్సిటీ), మహేందర్ (కాకతీయ యూనివర్సిటీ), అజయ్ (నిజాం కాలేజీ), రాకేష్ (సెంట్రల్ యూనివర్సిటీ) తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య అభ్యున్నతికి నూతన కమిటీ కృషి : ఉప్పు మనోహర్

సికింద్రాబాద్ ఆర్యవైశ్య క్లబ్ నూతన కార్యవర్గం.

బేగంపేట ఏప్రిల్ 21, ప్రభాతవార్త

ఆర్యవైశ్యులు అభ్యున్నతికి నూతన కమిటీ శాయిశక్తులా కృషి చేస్తుందని సికింద్రాబాద్ ఆర్యవైశ్య క్లబ్ నూతన అధ్యక్షుడు ఉప్పుమనోహర్ అన్నారు. సికింద్రాబాద్ ఆర్యవైశ్య క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో సభ్యులు ఆనందోత్సహాలతో గడిపారు. హిందూత్వం మనో గుండెల్లో. సేవ మన చేతుల్లో అనే నినాదంతో ఆర్యవైశ్య క్లబ్ సికింద్రాబాద్ నిర్వహించిన క్లబ్ ప్రమాణ స్వీకారోత్సవం కన్నుల పండువగా సాగింది. 2026.2027వ సంవత్సరానికి గాను ఆర్యవైశ్య క్లబ్ సికింద్రాబాద్ అధ్యక్షునిగా ఉప్పు మనోహర్, కార్యదర్శిగా పురం రమేష్, కోశాధికారిగా కొడిత్యాల రంజిత్‌కుమార్‌లు ప్రమాణ స్వీకారం చేసారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ సంస్కార శిక్షణ ప్రాంత ప్రముఖ్ విమలానంద బోడ్డు మల్లిఖార్జున్ ముఖ్య అతిధిగా, పుల్లూరి శ్రీకాంత్ గౌరవ అతిధిగా పూర్ణచందర్, అల్లాడి హరీష్‌కుమార్‌లు ప్రత్యేక అతిధులుగా సాలూరి సురేష్ ప్రాజెక్టు సలహాదారుగా, మహంకాళీ ఉమామహేశ్వర్ ప్రాజెక్టు ఛైర్మన్ హాజరయ్యారు. మంచికంటి రాధిక, ఉప్పుశ్రీఐశ్వర్యలు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. క్లబ్ పూర్వాధ్యక్షులు, కార్యవర్గసభ్యులు హాజరయ్యారు. ఎన్నో సంవత్సరాలుగా సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆర్యవైశ్య క్లబ్ సికింద్రాబాద్ మరింత పురోగతి సాధించాలని మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వక్తలు ఆశాభావం వ్యక్తం చేసారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా పేదలకు కుట్టు మిషన్, నిత్యావసర సరుకులను పంపిణీ చేసారు. అనాధాశ్రమానికి వృద్ధాశ్రమానికి చేయూతను అందించారు.

రాణా మెట్లెక్కిన ఖరీదైన కార్పెట్ వివాదం

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్‌లో ఒక ఖరీదైన కార్పెట్ వివాదం పోలీసు ఠాణాకు చేరింది. ఖరీదైన కార్పెట్‌ను తిరిగి ఇవ్వకుండా కంపెనీని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడన్న ఆరోపణలతో ఒక ఉద్యోగిపై ఈ కేసును నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లోని ఓబీటీ కార్పెట్స్‌లో పనిచేసే గుండా చంద్రశేఖర్ రెడ్డి జనవరి 30న భద్రత కారణంగా రూ.4,30,000 విలువైన కార్పెట్‌ను తన ఇంటికి తీసుకెళ్లాడు. అయితే, ఇటీవల అతని పనితీరు సరిగా లేకపోవడంతో సంస్థ అతడిని ఉద్యోగానికి రాజీనామా చేయమని కోరింది. దీంతో ఆగ్రహానికి గురైన చంద్రశేఖర్ రెడ్డి కార్పెట్‌ను తిరిగి ఇవ్వకుండా కంపెనీని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. ఒక కస్టమర్‌కు ఈ కార్పెట్‌ను తక్షణం అందించాల్సిన అవసరం ఉందని, అందువల్ల అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్టోర్ మేనేజర్‌గా పని చేస్తున్న సుకన్య ఆకర్ష్ జూబ్లీహిల్స్ పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః

పెళ్లి పేరుతో దగ్గరై, రెండు సార్లు గర్భస్రావం చేయించి ఇప్పుడు ముఖం చాటేసిన ఒకరిపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కొల్లూరుకు చెందిన సయ్యద్ సమితో బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన ఒక యువతికి 2023లో పరిచయమైంది. ఇది కాస్త ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటానని నమ్మించే వరకు వెళ్లింది. దీంతో ఇద్దరు ఒకరికొకరు దగ్గరయ్యారు. ఈ క్రమంలోనే ఆమె గర్భిణీ కాగా ప్రతిసారి నిందితుడు ఆమెకు మాత్రలు ఇచ్చి గర్భస్రావం అయ్యేలా చేశాడు. ఇటీవల పెళ్లికి ముఖం చాటేయడంతో పెద్దల సమక్షంలోనే చర్చలు జరిగాయి. అయినా పెళ్లికి అంగీకరించకపోవడంతో పెళ్లి పేరుతో తనను మోసగించాడంటూ సమిపై ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధ తండ్రిపై కుమారుడి దాష్టీకం

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః

ఒక వృద్ధ తండ్రిపై కుమారుడు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన బోరబండ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండ సైట్-3 సునీల్‌నగర్‌లో నివసించే రంగారెడ్డి(70) చిన్న కుమారుడు అనీల్‌కుమార్(43) సెంట్రింగ్ వర్క్ చేస్తుంటాడు. ప్రతి రోజు మద్యం సేవించి ఇంటికి వచ్చే అనీల్‌కుమార్ ఈ నెల 20న మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. వచ్చి రాగానే తండ్రితో గొడవకు దిగి అతన్ని దూషిస్తూ అతని చేతికి ఉన్న రింగ్ సాయంతో దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయలయ్యాయి. దీంతో బాధితుడు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సిటిజన్ సెంట్రిక్ సెక్షన్ 118(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముషీరాబాద్‌లో హైబ్రిడ్ గంజాయి స్వాధీనం

చిక్కడపల్లి ఏప్రిల్ 21 (ప్రభాతవార్త) :

ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీఎత్తున హైబ్రిడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా హైబ్రిడ్ గంజాయి (ఓ జి కుష్) పట్టుబడింది. పక్కా సమాచారం మేరకు స్థానిక ఇన్స్పెక్టర్ డి.రామకృష్ణ నేతృ త్వంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1.311 కేజీల మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ముషీరాబాద్ ఎస్‌హెచ్ఓ సిబ్బందితో కలిసి నామాలగుండు ప్రాంతంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద తనిఖీలు చేపట్టారు. అక్కడ బర్గ్‌మన్ వాహనంపై ఉన్న రోషన్ సింగ్ (29) అనే వ్యక్తిని ఆపి సోదా చేయగా, అతని కాలేజీ బ్యాగులో అత్యంత ఖరీదైన ఖిఓజీ కుష్‌ఖి (హైబ్రిడ్ గంజాయి) లభించింది. పద్మారావు నగర్‌కు చెందిన రోషన్ సింగ్‌పై గతంలో కార్ఖానా పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు నమోదై ఉంది. కాగా ఈ కేసులో ఏ2 నిందితుడిగా యాపియల్‌కు చెందిన ఇంజోత్ సింగ్ (27)ను పోలీసులు గుర్తించారు. ఇంజోత్ సింగ్‌పై గత నెల 16న కుతుబుల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద లభించిన 1.311 కేజీల డ్రగ్స్ విలువ మార్కెట్లో సుమారు రూ. 26 లక్షల నుండి రూ. 39 లక్షల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నగరంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాల మూలాలను వెలికితీసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.

ఇ-పెట్టి కేసులో వ్యక్తికి రెండు రోజుల జైల్ శిక్ష

గోషామహల్, ఏప్రిల్ 21ప్రభాతవార్త: అసభ్యప్రవర్తన, దాడి ఆరోపణలతో కూడిన ఓ వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైల్ శిక్ష విధించింది. ఈ సంఘటన గోషామహల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోచోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. బేగంబజార్ కోల్సావాడి ప్రాంతానికి చెందిన ఎ.గురునాథ్(55) ఆకారణంగా ఓమహిళాను దూషించి, అసభ్యకరమైన భాషనుఉపయోగించడంతో గోషామహల్ పోలీసులు అతనిపై ఈ-పిటి, సెక్షన్70(బి), 70(సి), సిపి యాక్టు115(2) కింద కేసు నమోదు చేసి స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగాగురునాథ్‌కు రెండు రోజుల జైల్ శిక్ష విధించారు. ఈ కేసును గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్రం చెరువులో చిక్కుకున్న వృద్ధుడిని రక్షించిన పోలీసులు

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త : చాంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలోని గుర్రం చెరువులో చిక్కుకున్న ఒక వృద్ధుడిని పోలీసులు క్షేమంగా బయటకు తీశారు. అనంతరం వైద్య పరీక్షలు జరిపించి ఆహారాన్ని అందజేశారు. వివరాలలోకి వెళితే మచ్చబొల్లారం నివాసి ఎల్లప్ప కుమారుడు హనుమంత (60) మంగళవారం మధ్యాహ్నం బాలాపూర్ రోడ్డులోని గుర్రం చెరువులోకి దిగి అందులో చిక్కుకు పోయాడు. బయటకు రాలేక గుర్రపు డెక్క, బురద నీటి మధ్య ఇరుక్కున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి స్టేషన్, లేక్ పోలీసు సిబ్బందితో కలిసి చెరువులో చిక్కుకున్న వృద్ధుడిని దృఢమైన ప్లాస్టిక్ తాడుతో చాకచక్యంగా బయటకు లాగారు. ఎండదెబ్బకు అలసి సొలసి ఉన్న హనుమంతుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తక్షణ శక్తినిచ్చే పానీయాలను, ఆహార పదార్థాలను అందజేశారు. చెరువులో చిక్కుకున్న వృద్ధుడిని రక్షించిన ఇన్‌స్పెక్టర్ గోపి బృందాన్ని స్థానికులు అభినందించారు. కానిస్టేబుళ్లు జగదీష్, నాగులు, ప్రవీణ్, జబ్బార్ తదితరులు ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

బైరుని చెరువులో గుర్తుతెలియని మృతదేహం

కొంపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బైరుని చెరువులో ఒక గుర్తుతెలియని పురుషుడి మృతదేహం తేలుతూ కనిపించడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం సుమారు 09:39 గంటలకు చెరువులో మృతదేహం తేలుతున్నట్లు పెట్రోలింగ్ మొబైల్‌కు సమాచారం అందింది. వెంటనే పోలీసులు, మున్సిపల్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్యగా ఉండవచ్చుని, గోధుమ వర్ణం కలిగిన వ్యక్తిగా గుర్తించారు. అయితే మృతదేహం వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లభించకపోవడంతో, స్థానికులు కూడా ఆయనను గుర్తించలేకపోయారు. ఈ ఘటనపై బచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కి తరలించారు.

ఆస్థి వ్యవహారంలో వృద్దుడిపై దాడి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః

ఆస్థి వ్యవహారంలో ఒక వృద్దుడిపై దాడి చేసిన ఇద్దరిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ శ్రీకృష్ణ నగర్‌లో మహమ్మద్ యూనస్ అలీ(75) తన నివాసంలోని రెండో, మూడో అంతస్తులను నెలకు రూ. 8వేల అద్దెకు మొహమ్మద్ ఫైయాజ్ అలీ, అతని భార్య ఫర్హత్ ఫాతిమాకు ఇచ్చారు. వృద్ధాప్యం, సంతానం లేకపోవడాన్ని ఆసరాగా తీసుకున్న వారిద్దరు 2019లో మోసపూరితంగా తప్పుడు సమాచారం ఇచ్చి, ఫైయాజ్ అలీని అతని కుమారుడిగా చూపిస్తూ పార్టిషన్ డీడ్ నమోదు చేయించుకున్నారు. ఈ విషయాన్ని 2024లో గుర్తించిన బాధితుడు, ఆ డీడ్‌ను రద్దు చేయాలని సివిల్ కోర్టులో కేసు వేశారు. దీనిపై కక్ష పెంచుకున్న నిందితులు ఏప్రిల్ 13న మధ్యాహ్నం సమయంలో ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, వృద్ధుడిని దూషిస్తూ దాడి చేశారు. ఈ ఘటన తర్వాత కూడా నిందితుల నుంచి తన ప్రాణాలకు ముప్పు ఉందని బాధితుడు ఆందోళన వ్యక్తం చేస్తూ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 316(2), 351(2)(3), 352, 351తో పాటు బీఎన్ఎస్ఎస్ 175(3) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ నంబర్ ప్లేట్‌తో తిరుగుతున్న యువకుడు అరెస్ట్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః నకిలీ నంబర్ ప్లేట్‌తో వాహనంపై సంచరిస్తున్న ఒక యువకుడిని జూబ్లీహిల్స్ ట్రాఫిక్, శాంతి భద్రతల విభాగా పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో పట్టుకున్నారు. ట్రాఫిక్ నిబంధనల నుంచి తప్పించుకోవడానికి, అధికారులను తప్పుదోవ పట్టించడానికి నిందితుడు ఈ అక్రమానికి పాల్పడినట్లు గుర్తించారు. సంయుక్త కమిషనర్(ట్రాఫిక్) జోయల్ డేవిస్ తెలిపిన వివరాల ప్రకారం.. స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న వి. సురేష్ కుమార్ (26) తన హోండా యాక్టివా వాహనానికి అసలు నంబర్ టీఎస్09బి డబ్ల్యూటీఆర్7624 కు బదులుగా ఏపీ 39కేజీ 7219 అనే నకిలీ నంబర్ ప్లేట్‌తో సంచరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లో తనిఖీ లు చేపట్టిన పోలీసులు అతని వాహనానికి ఉన్న నకిలీ నంబర్ ప్లేట్‌ను గుర్తించి వాహనాన్ని, అతన్ని అదుపులోకి తీసుకొన్నారు.

రూ.10 కోట్లతో తిరుమలగిరి చెరువు సుందరీకరణ : ఎమ్మెల్యే శ్రీగణేష్

7వ వార్డు తిరుమలగిరి సుందరీకరణ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు తిరుమలగిరి చెరువు సుందరీకరణగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వనిధులతో రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం బోర్డు అధికారులతో కలిసి ఆయన తిరుమలగిరి లేక్, చెరువు ప్రాంతాన్నీ ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువు చుట్టూ జరుగుతున్న సివిల్ పనులు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం పనులను ఆయన పర్యవేక్షించారు. కంటోన్మెంట్ నప్రజలకు మెరుగైన మౌలిక వసతులు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్ధేశంతో రూ.10 కోట్ల వ్యయంతో లేక్ అభివృద్ధిని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, 7 వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నేత మురళీ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

పార్టీలో పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు : రామక్రిష్ణ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర నేత రామక్రిష్ణ తదితరులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడంలో మహిళా కాంగ్రెస్ పార్టీ మహిళా లోకానికి నష్టం చేసిందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జె.రామక్రిష్ణ తెలిపారు. మంగళవారం మహేంద్రహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకైన కార్యకర్తలు ముఖ్యమన్నారు. డీలిమిటేషన్లతో పార్లమెంట్ అసెంబ్లీ స్థానాలు పెరగడంతో కార్యకర్తలకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం దక్కేదన్నారు. అయితే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు కాకపోవడం, డీలిమిటేషన్లు తగ్గడంతో ఆయా పార్టీలలో పనిచేసే కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు కార్యకర్తలే ముఖ్యమన్నారు. కార్యకర్తలకు జరిగిన అన్యాయాన్ని ప్రతిఘటించాలన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల కుటుంబ వారసత్వ రాజకీయాలకు స్వస్తి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు నర్సింగ్ రావ్, టోపీ శంకర్, నాగభూషణ్ రెడ్డి, సతీష్ కుమార్, విజయ్ యాదవ్, వీరవర్ధన్, శాలినీలతో పాటు కంటోన్మెంట్ బోర్డులోని 8 వార్డుల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాట్లను పరిశీలించిన రాకేష్



జీడిమెట్ల, ఏప్రిల్ 21, ప్రభాతవార్త వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జాలిగం రాకేష్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లను పరిశీలించి, ప్రజలకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ప్రతి సేవా కార్యక్రమం సక్రమంగా కొనసాగాలని అన్నారు. మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కలిగించేందుకు ఇటువంటి చలివేంద్రాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు. అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న రాకేష్, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ సభ్యురాలిగా దేశభక్తుల సుధా రవి..

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త



కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ఓబిసి మోర్చా ఆఫీస్ సెక్రటరీ దేశభక్తుల సుధా రవి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ సభ్యురాలిగా నియమితులయ్యారు. భారతీయ జనతా పార్టీ శ్రేయస్సు కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తున్న తాను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ సభ్యురాలిగా నియామకం పొందడం ఎంతో గర్వకారణం అని సుధా రవి పేర్కొన్నారు. తనకు సహకరించినహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కి, రాష్ట్ర పార్టీకి ప్రత్యేక ధాన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

బస్సు ప్రయాణికుల నుంచి బంగారం చోరీ

-అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్, 17 తులాల బంగారం స్వాధీనం

సమావేశంలో డిసిపి చంద్రమోహన్, అధికారులు..స్వాధీనం చేసుకొన్నా బంగారం.

కార్వాన్, అప్జల్‌గంజ్ ఏప్రిల్ 21(ప్రభాతవార్త) అప్జల్‌గంజ్ పోలీసులు ఒక ప్రధాన బంగారం చోరీ కేసును ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేసి 17 తులాల బంగారం స్వాధీనం చేసుకోవడం జరిగిందని గోల్కొండ జోన్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.చంద్రమోహన్ తమ కార్యాలయంలో నిర్వాహించిన విలేఖరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భముగాకేసు వివరాలు వెల్లడిస్తూ.. హైదరాబాద్ లోని కొండాపూర్‌కు చెందిన డాక్టర్ డి.ఎస్.కీర్తన ఈ నెల12వ తేదీ రాత్రి అనంతపురం నుండి హైదరాబాద్‌కు మీనా ట్రావెల్స్ బస్సులో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం ఆమె హైదరాబాద్ చేరుకున్నాక చూసుకోగా, తన బ్యాగులో ఉన్న సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు లాంగ్ హారం, మంగళసూత్రం, బంగారు గొలుసు, గాజులు, ఉంగరాలు చోరీకి గురైనట్లు గుర్తించి, ఆమె అప్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందన్నారు. నిందితుడి వివరాలు తెలుపుతూ.. అరెస్టయిన నిందితుడు కర్నూలు జిల్లా బుధవారపేటకు చెందిన అన్నారెడ్డి వెంకట శివారెడ్డి 35అని, సూపర్ మార్కెట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఇతనికి జూదం, విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించడం కోసం దొంగతనాలకు పాల్పడుతున్నాడన్నారు. ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణికులు నిద్రిస్తున్న సమయంలో వారి బ్యాగులను తనిఖీ చేసి బంగారాన్ని అపహరించడం ఇతని శైలియని, నిందితుడు గతంలో అనేక నేరాలకు పాల్పడ్డాడన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం టౌన్, కర్నూలు , టౌన్, విజయవాడ సూర్యారావుపేట, కడప జిల్లాలోని వేముల, ప్రొద్దుటూర్ రూరల్, కడప రూరల్, ప్రొద్దుటూర్ । టౌన్ స్టేషన్ల పరిధిలలో ఇతనిపై దొంగతనం, ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదై ఉన్నాయన్నారు. నిందితున్ని న్యాయస్థానంలో ప్రవేశ పెట్టడం జరుగుతోందని అన్నారు. కేసు దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసిన అప్జల్‌గంజ్ ఎస్‌హెచ్ఓ ఎన్. మోహన్ రావు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి.రవికిరణ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, డీఎస్ఐ వి.నరేందర్ రెడ్డి, సిబ్బంది జె.జితేందర్, జి.శ్రీకాంత్ , జి.మధుసూదన్, శ్రీకాంత్ బిడ్లా, ఎస్.ప్రియాంక, కె.శివాని లను డిసిపి చంద్రమోహన్ అభినందించి, రివార్డులను ప్రకటించారు.

బల్కంపేట్ ఎల్లమ్మ తల్లికి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: బల్కంపేట్ ఎల్లమ్మ తల్లి దేవాలయానికి మంగళవారం ఉదయం 5:00 గంటలకు పొన్నం ప్రభాకర్ విచ్చేసి అభిషేక కార్యక్రమంలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ అభిషేకాన్ని నిర్వహించగా, స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా దేవాలయ పరిసరాల్లో భక్తి వాతావరణం నెలకొంది. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. భక్తులతో కలిసి కొంతసేపు గడిపిన ఆయన, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని కోరుకున్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించేంత వరకు ఉద్యమించాలి : నర్మధ



కంటోన్మెంట్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించడంలో కాంగ్రెస్ ఎంపీలు వ్యతిరేకించడం సరైంది కాదని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ టిటిలి గార్డెన్‌లో నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళా వ్యతిరేక కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. మహిళలకు సమానహక్కులు ఇవ్వాలని పార్లమెంట్‌లో పెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు విగిపోయే విధంగా కుట్రలు చేసిన కాంగ్రెస్ ఎంపీలకు, ఆపార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. 75 సంవత్సరాల నుంచి మహిళలు ఓటు వేస్తున్న వారికి సమన్యాయం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు బి.ఎన్.శ్రీనివాస్, టోపీ శంకర్, జే.వి.నర్సింగ్ రావ్, బానుక మల్లికార్జున్, నాగభూషణ్ రెడ్డిలతో పాటు ఆయా వార్డుల బిజెపి మహిళా మోర్చా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం...

కార్వాన్, ఏప్రిల్ 21(ప్రభాతవార్త) కుల్సుంపురాపోలీస్ స్టేషన్ పరిధిలోని కాశీబుగ్గ ఆలయం సమీపంలోని జియాగూడ 100 ఫీట్ల రోడ్డులో గుర్తుతెలియని మహిళ మృతదేహం ఉందనే సమాచారంతో ఘటన స్థలికి చేరుకొని కేసు నమోదు చేసుకోవడం జరిగిందని కుల్సుంపురా పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్వేతా తెలిపారు. చనిపోయిన మహిళ వయస్సు 40సం. ఉంటుందని, ఒంటిపై పసుపు రంగు టీ షర్ట్, మెరూన్ రంగు ప్యాంటు ధరించి ఉందని, నల్లని ఉంగరాల జుట్టు కలిగి ఉందని, హిందూ మతానికి చెందినదిగా కనిపిస్తోందని వివరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని భద్రపరచడం కోసం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతురాలుకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటె కుల్సుంపురా పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని ఎస్ఐ శ్వేతా పేర్కొన్నారు.

రామాలయానికి 10 లక్షల రూపాయల విరాళం

విరాళాన్ని అందజేస్తున్న వడ్డేపల్లి

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త కూకట్‌పల్లి ప్రజల సంక్షేమం కోసం అనేక ధార్మిక కార్యక్రమాలలో ఎల్లప్పుడూ ముందుండే రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మరోసారి తన భక్తి భావాన్ని చాటుకున్నారు. కూకట్‌పల్లిలోని 400 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ హనుమాన్, గరుడ విగ్రహమూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమం కొరకు పది లక్షల చెక్కును ఆలయ మాజీ చైర్మన్ నాయినేని శ్రీనివాస్ రావు (తులసి రావు)కి మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి దివ్య ఆశీస్సులతో గరుడ, హనుమాన్ విగ్రహమూర్తుల ప్రతిష్ఠాపన జరగడం అత్యంత ఆనందదాయకమని తెలిపారు. అదే విధంగా పాంచన్నిక అష్టకుండాత్మక శ్రీ రామాయణ మహాయజ్ఞ మహోత్సవంలో కూకట్‌పల్లి ప్రాంత ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించేందుకు ఆలయ అభివృద్ధికి సనాతన ధర్మ పరిరక్షణకు వడ్డేపల్లి రాజేశ్వరరావు చేస్తున్న సేవలు అభినందనీయమని స్థానిక భక్తులు ప్రశంసించారు.

భార్య భర్తల హత్య కేసుల్లో అన్న అరెస్ట్..

యాకుత్‌పుర, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : పాతబస్తీ సుల్తాన్‌పురలో భార్యభర్తలను కత్తితో పొడిచి అతి దారుణంగా హత్య చేసిన సొంత అన్న ఆదిల్ ఖాన్‌ను మీర్‌చౌక్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీర్‌చౌక్ ఏసిపి శ్యామ్‌సుందర్, మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ కొండలరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. పాతబస్తీ సుల్తాన్‌పురకు చెందిన అఖిల్ ఖాన్ (30) కారు డ్రైవర్. అఖిల్ ఖాన్ భార్య అజ్మీరా బేగం (26), నలుగురు పిల్లలతో కలిసి సుల్తాన్‌పురలో నివాసం ఉంటున్నాడు. కాగా పహాడిషరీఫ్‌లో ఉంటున్న అఖిల్ అన్న ఆదిల్ ఖాన్‌కు సంతానం లేదు. తనకు సంతానం లేకపోవటంతో తమ్ముడు కుటుంబంపై అన్న అదిల్ ఖాన్‌కు అసూయ ఉండేది. చేబదులు, పిల్లల దత్తత విషయంలో విభేదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబధించిన విషయాలలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య గొడవ జరుగుతున్నది. ఈ నెల 20వ తేదీ సోమవారం సాయంత్రం ఆదిల్ ఖాన్ తమ్ముడు అఖిల్ ఖాన్ ఇంటికి వచ్చి కత్తితో అఖిల్ ఖాన్, అజ్మీర బేగంను కత్తితో పొడిచాడు. ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన భార్య భర్తలిద్దరు అఖిల్ ఖాన్, అజ్మీర్ బేగం సంఘటన స్థలంలోనే చని పోయారు. హత్య జరిగిన ఇరవై నాలుగు గంటలు గడవకు ముందే మీర్‌చౌక్ పోలీసులు నింధితుడు ఆదిల్ ఖాన్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నింధితుడు ఆదిల్ ఖాన్ వద్ద నుంచి కత్తి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ విలేకర్ల సమావేశంలో మీర్‌చౌక్ డిఐ ఎన్.సైదయ్య, ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. మీర్‌చౌక్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

సినీ నటుడు ప్రకాష్ రాజ్‌పై జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రకాష్ రాజ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తున్న సంఘం సభ్యులు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త దేశ ప్రజలంతా పవిత్రంగా ఆరాధించే లోకాభిరాముడైన శ్రీ రామునిపై సినీ నటుడు ప్రకాష్ రాజ్ శ్రీరాముని కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన దానిని ఖండిస్తూ జగద్గిరిగుట్ట సగర ఉప్పర సంఘం ఆధ్వర్యంలో సినీ నటుడు ప్రకాష్ రాజ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల కేరళలో జరిగిన సాహిత్య ఉత్సవం సందర్భంగా పాల్గొన్న ప్రకాష్ రాజ్ రామలక్ష్మణులను వలస కూలీలుగా వర్ణిస్తూ దక్షిణ భారతానికి చెందిన రావణుని పొలంలో రామలక్ష్మణులు పండ్లు దొంగిలించారని ఇది చూసిన రావణాసురుడి చెల్లెలు సూర్పనఖ జీఎస్టీతో కలిపి 2 వేల డాలర్లు కట్టాలని చెప్పడంతో రాముడికి, రావణాసురుడికి వివాదం మొదలైందని వ్యంగ్యంగా మాట్లాడారు. నిత్యం 100 కోట్ల మంది ప్రజలు పవిత్రంగా ఆరాధించే మా కుల దైవమైన శ్రీరాముని కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు ప్రకాష్ రాజుపై కేసు నమోదు చేయాలని జగద్గిరిగుట్ట సగర సంగం సభ్యులు సిఐ వెంకటేశంకు ఫిర్యాదు చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రకాష్ రాజ్‌పై సినీ పరిశ్రమ ప్రత్యేక చర్యలు తీసుకొని సినిమా అవకాశాలు ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వేముల సుదర్శన్ సాగర్, ప్రధాన కార్యదర్శి ఎం. ఎస్. భీమయ్య సాగర్, కోశాధికారి ఎం. వెంకటరమణ సాగర్, స్టీరింగ్ కమిటీ వైస్ చైర్మన్ మోదల రాములు సాగర్, ఆస్కానీ శ్రీనివాస్ సాగర్, రాచాల శ్రీనివాస్ నగర్, డి. శ్రీరాములు సాగర్, ఆర్‌కె దయాసాగర్, ఎన్. రామకృష్ణ సాగర్, కెపి. కిషోర్ సాగర్, సుమన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారులమంటూ బురిడీ కొట్టించే యత్నం

వ్యాపారి అప్రమత్తతతో పోలీసులు వలలో చిక్కిన వైనం

అల్వాల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: ఫుడ్ సేఫ్టీ అధికారులమంటూ ఓ స్వీట్ దుకాణ యజమానిని బురిడీ కొట్టించడానికి ప్రయత్నించిన ఇద్దరు మహిళలను అల్వాల్ పోలీసులు అరెస్టు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఓల్డ్ అల్వాల్‌లోని బాలాజీ సురేష్ కుమార్ మిఠాయి భండార్‌కు మంగళవారం మధ్యాహ్నం గుంటి సరిత(30), దివిటి లావణ్య(26)లు రావడం జరిగింది. ఫుడ్ సేఫ్టీ అధికారిణిమలని తనిఖీలు చేయాలని వ్యాపారితో మొదటిగా చెప్పారు. డబ్బు ఇస్తే తనిఖీలు ఉండవని బేరాలు అడడం మొదలు పెట్టారు. స్వీట్ దుకాణం యజమానికి అనుమానం వచ్చి స్థానిక జిహెచ్ఎంసికి చెందిన ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మీకాంత్‌కు సమాచారం అందించడాడు. స్వీట్ దుకాణానికి చేరుకున్న ఆయన గుర్తింపు కార్డులు చూపించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఫుడ్ సంస్థకు చెందిన వారమని పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. తక్షణం లక్ష్మీకాంత్ అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరువురు మహిళలను అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఇద్దరు మహిళలుపై గతంలో ఫిర్యాదులు ఉన్నట్లు తేలింది. కెవిజిఎం(క్రై వంజీబాబ గ్రామీణ వికాస్ మండల్) పేరిట వ్యక్తులను పంపించి వ్యాపారులుపై ఒత్తిడి తెచ్చారు. ఈ సంస్థపై ఫసాయ్ 22 ఆగస్టు 2023లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఎంపానెల్‌మెంట్‌ను సస్పెండ్ చేసిన విషయం బయట పడింది. తనిఖీలు పేరుతో వ్యాపారులు వద్దకు వ్యక్తులు వచ్చిన సమయంలో వారి గుర్తింపు కార్డులు చూడాలని పోలీసులు కోరుతున్నారు. అనుమానం వస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

కత్తితో రౌడీ షీటర్ దాడి.. ఇద్దరికి గాయాలు

అత్తాపూర్ ఏప్రిల్21, ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. డబ్బుల కోసం బెదిరించి, నిరాకరించడంతో ఇద్దరిపై దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, ముస్తఫానగర్, ఓవైసీ హిల్స్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ (27), వృత్తి ప్లంబర్, తన బాబాయి కుమారుడు మహ్మద్ పర్వేజ్‌తో కలిసి తరచూ ప్లంబింగ్ పనులకు వెళ్తుంటాడు. ఏప్రిల్ 20వ తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇస్మాయిల్, పర్వేజ్‌ను తన ఇంటి వద్దకు పిలిచాడు. ఇద్దరూ సమీపంలోని నిర్మాణంలో ఉన్న భవనం వద్ద మాట్లాడుకుంటుండగా, అదే భవనం మొదటి అంతస్తులో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన రౌడీషీటర్ అతౌల్లా అలియాస్ మహ్మద్ తన స్నేహితుడితో కలిసి మద్యం సేవిస్తున్నాడు. రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో అతని స్నేహితుడు అక్కడి నుంచి వెళ్లిపోయిన తరువాత, అతౌల్లా ఇద్దరిని పిలిచి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. వారు నిరాకరించడంతో కత్తితో బెదిరించి, హత్యాయత్నంతో వారిపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఇస్మాయిల్ కడుపు భాగంలో తీవ్ర గాయాలు కాగా, పర్వేజ్ కుడి వైపు కడుపు భాగంలో గాయపడ్డాడు. గాయపడిన వారు వెంటనే తమ సోదరుడు మహ్మద్ యూనుస్‌కు సమాచారం ఇవ్వగా, అతను వచ్చి వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళల పై దాడి ..నలుగురిపై కేసు నమోదు

సికింద్రాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళలపై దాడి చేసిన ఘటనలో నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రోడ్డుపై మద్యం సేవించి న్యూసెన్స్ సృష్టించడమే కాకుండా, వారిని అడ్డుకున్న ఇద్దరు మహిళలపై దాడి చేసి, అసభ్య పదజాలంతో దూషించిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బన్సీలాల్‌పేట్ డి క్లాస్‌కు చెందిన త్రిశూల్ శ్రీకాంత్, త్రిశూల్ మహేందర్, త్రిశూల్ శివ, త్రిశూల్ విజయ్ అనే నలుగురు వ్యక్తులు అదే ప్రాంతానికి చెందిన బి. యాదమ్మ, బి. సునితలను లక్ష్యంగా చేసుకొని దూషణలకు దిగారు. యాదమ్మను శారీరకంగా దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, వివేకానంద అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ వద్ద త్రిశూల్ శివ (గణేష్ కుమారుడు) గంజాయి మత్తులో మద్యం సేవిస్తూ బీర్ బాటిల్‌తో తిరుగుతుండగా పెట్రోలింగ్ పోలీసులు గమనించారు. అతనిని మందలించగా పోలీసులకు ఎదురు తిరగడంతో స్టేషన్‌కు తరలించారు. అనంతరం జామీనుపై బయటకు వచ్చిన శివ స్థానికులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ గొడవలకు దిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో స్థానిక బస్తీవాసులు గుంపుగా గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అందరూ కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం యాదమ్మ ఇంటికి వెళ్తుండగా, త్రిశూల్ కుటుంబ సభ్యులు కలిసి మరోసారి ఆమెను, సునితను దూషిస్తూ దాడికి దిగారు. పరిస్థితిని సర్దుబాటు చేయడానికి ప్రయత్నించినప్పటికీ, వారు వినకపోవడంతో ఘర్షణ మరింత తీవ్రమైంది. స్థానికులు తెలిపిన ప్రకారం, గంజాయి శివ తరచూ మత్తులో గొడవలు సృష్టిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నాడు. గతంలో కూడా ఆయుధాలతో సంచరిస్తూ పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లిన ఘటనలు ఉన్నాయని వెల్లడించారు. బాధితులైన యాదమ్మ, సునిత ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ దండన చట్టంలోని సెక్షన్ 74, 115 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు విజిలెన్స్ దినోత్సవం

కార్యక్రమంలో పాల్గొన్న ఆశ్రిత సంస్థ ప్రొగ్రామ్ మేనేజర్ వి.పర్వతాలు

చార్మినార్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : బాల్య వివాహాలను అరికట్టేందుకు దూద్‌బౌలిలోని ఆశ్రిత సంస్థ జిల్లా యంత్రాంగంతో కలిసి విజిలెన్స్ దినోత్సవాన్ని దూద్‌బౌలిలో నిర్వహించింది. ఈ సందర్భంగా ఆశ్రిత సంస్థ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ బాల వివాహం ఒక హేయమైన నేరమని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంతో బాల్య వివాహాల సంఖ్య గణనీయంగా తగ్గినప్పటికి పూర్తిగా నిర్మూలించవలసిన అవసరం ఉందని తెలిపారు. బాల్య వివాహాలలో పాల్గొనే ప్రతీ ఒక్కరూ నేరస్థులేనని ఆయన తెలియజేశారు. ఆశ్రిత హోం మేనేజర్ వి.పర్వతాలు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కోసం పని చేస్తున్న సంస్థ, గ్రామాలు, పట్టణాలలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించిందని తెలియజేశారు. కాగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE, MEDCHAL- MALKAJGIRI AT: MALKAJGIRI
O.S. No. 311 OF 2025

BETWEEN:
Amey Ajit Pandit, S/o. Late Ajit Madhukar Pandit, Aged about 41 years, Occ: Business, R/o: 9-9-138/1, Street No. 4, Reddy Colony, Champapet, Saidabad, Hyderabad. ...Plaintiff

AND

1. Mandal Revenue Officer (MRO), Nagole Village, Uppal Mandal, Telangana
2. All Concerned ...Defendant/s

NOTICE

Please take notice that the Plaintiff has filed the above O.S for suit for declaration, declaring the Plaintiff as sole legal heir of deceased Late Ajit Madhukar Pandit and Late Akshata Ajit Pandit, whereas Late Ajit Madhukar Pandit was the owner and possessor of the schedule properties. That you are hereby directed to appear either in person or by duly appointed Advocate on 06-05-2026 on the aforesaid court at 10.30 A.M., failing which the matter will be decided and heard on merits in your absence.

Schedule of Property:
All that the land bearing plot No. 190&189 (part) in Sy. No. admeasuring 300 Sq.yards or 251 Sq.Mts situated at Nagole Village, Uppal Mandal, Ranga Reddy District under S.R.O. Uppal and bounded by: North: 30' Wide Road; South:Plot No. 171 and 172 (part); East:Owner's land; West:Plot No. 189 (part).
All that the land bearing plot No. 188 &189 (part) in Sy. No. admeasuring 300 Sq.yards or 251 Sq.Mts situated at Nagole Village, Uppal Mandal, Ranga Reddy District under S.R.O. Uppal and bounded by: North:30' Wide Road; South: Plot No. 173 and 172 (part); East:Plot No. 189 (part); West: Plot No. 187.
(BY ORDER OF THE HON'BLE COURT)
Sd/- M/s. Nandini S. Bilolikar
Apurva M. Gokhale
Advocates for Plaintiff
#505, Citadel Apartments, Vittalwadi Road, Himayathnagar, Hyderabad. Ph. 9989488000

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, HQ, STSQM, CMC
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No. 06/SE (STSQM)/HO/CMC/2026-27 తేదీ: 21.04.2026
పని కేటగిరీ : బౌట్ సోర్స్‌డు మానవశక్తి నియామకం. అంచనా మొత్తం (రూ.లక్షల్లో) : 141.79. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ/చివరి తేదీ మరియు సమయం : 22.04.2026 ఉ.11.30గం. 29.04.2026 ఉ.11.30గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: SE, STSQM, HQ, CMC, 9063836124
సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్, STSQM, HQ, CMC.
DIPR.NO. 1157-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 21.04.2026

పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త


108 టెంకాయలు కొట్టిన దృశ్యం

కెపిహెచ్‌బి కాలనీ గోకుల్ ఫ్లాట్స్‌లోని శ్రీ అభయ వీ రాంజనేయస్వామి ఆలయంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కి జరిగిన శస్త్రచికిత్స నుండి త్వరగా కోలుకోవాలని మంగళవారం పవన్ కళ్యాణ్ యూత్ ఫోర్స్ గోపాల్ నగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు, ఆకు పూజ లకు ముఖ్యతిదిగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కో ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని పవన్ కళ్యాణ్ గోత్రం పేరున పూజలు నిర్వహించి, అనంతరము 108 టెంకాయలు కొట్టి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ నగర్ పవన్ కళ్యాణ్ యూత్ ఫోర్స్ సభ్యులు, జనసేన నాయకులు, కాలనీ వాసులు, అభిమానులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎన్ఆర్ఐ మృతి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: గుండెపోటుతో ఒక ఎన్ఆర్ఐ మృతి చెందిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. అమెరికాలోని వాషింగ్టన్‌లో నివసించే ఎన్ఆర్ఐ మాడ శ్రీపాల్ రెడ్డి (53) ఇటీవల అధికారిక పనిమీద భారత్‌కు వచ్చారు. ఈ నెల 18న హైదరాబాద్‌కు చేరుకుని బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో దిగారు. ఆయనకు అకస్మాత్తుగా అస్వస్థత కలగడంతో హోటల్ సిబ్బంది వెంటనే యశోద ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి చేరుకునేలోపే ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయంపై ప్రవీణ్ పన్నాల అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపినట్లు తెలిపారు.

CORRIGENDUM TO THE PUBLIC NOTICE DATED 19-04-2026

Take notice that our client intends to transact with the owners, K. Prashanth Reddy, K. Rakesh Reddy, K. Pratap Reddy, K. Priyanka Reddy and Datta Bio Pharma Pvt. Ltd. in respect of all that piece and parcel of immovable property admeasuring and aggregating to Acres 25 and Guntas 27.01 falling within below mentioned Survey numbers all situated at Lalgadi Malakpet Village, Aliyabad Municipality, Shamirpet Mandal, Medchal-Malkajgiri District, Telangana (collectively, the "Said Property"): Name of the Owner : K. Prashanth Survey Nos.: 314/B/1, 346/A/1, 351/B, 305/A, 305/B/1, 306/1, 319/1, 350/1, 351/1, 349/D/A/1/1, 349/C/2, 349/B/1/1, 349/A/1, 352/A/2/2/1, 349/D/AA, 349/A/2, 352/A/2/2/2, 352/A/1/1/1/2. Extent in Acres and Guntas : 9.385, Name of the Owner : K. Rakesh Survey Nos.: 315, 318/A, 320, 324/A/1, 324/A/2, 324/A/3, 324/B, 325/A, 325/D/1, 326/A, 326/B, 327, 328, 331, 332/1, 332/3, 342/B, 342/C, 342/D, 342/E, 348/1/1/1, 352/B, 354. Extent in Acres and Guntas : 9.3538, Name of the Owner : K. Pratap Reddy, Survey Nos.: 314/A, 322/1, 329/B, 359/C/1, 359/C/2, 359/D/1/2, 314/B/2, 322/2, 329/A. Extent in Acres and Guntas : 1.345 Name of the Owner : K. Priyanka, Survey Nos.: 336 (P). Extent in Acres and Guntas: 0.10, Name of the Owner : Datta Bio Pharma Pvt Ltd, Survey Nos.: 321/7, 323/7, 333/7, 321/6, 323/6, 333/6, 321/5, 323/5, 333/5, 321/4, 323/4, 333/4, 321/3, 323/3, 321/2, 323/2, 333/2/1, 321/1, 323/1, 346/B/2, 346/A/2, 348/A/2/3/2, 349/B/2, 349/D/A/2, 352/A/2/3, 346/A/3/1/1/1/1/1, 348/A/2/4/1, 349/C/1, 352/A/2/4, 348/A/2/3/1/1, 305/B/2, 306/2, 319/2, 350/2, 351/A/2, 355/2/1/1, 348/A/2/1/2, 352/A/2/1/2. Extent in Acres and Guntas: 3.2863

The Said Property is bounded as below:
East : 50 feet wide road and land belonging to Shanker and Ramuloo
West : Land belonging to Sheshgiri Rao
North : Land belonging to Granules Life Science Company
South : Land belonging to Srinivas Yadav and Bhaskar Yadav

Any person, authority or entity (incorporated or otherwise) having any right, title, interest, claim or pending litigation on the Said Property is called upon to contact the undersigned with details of such right, title, interest, claim or pending litigation together with supporting documents within a period of seven (7) days from the date of this notice, failing which such right, title, interest or claim shall be considered waived or given up. Objections received after a period of seven (7) days from the date of this notice shall neither be entertained nor binding on our client.
Date: 22 April 2026 Place: Hyderabad, Telangana.
Sd/- Mansi Singh
BTG Advaya, Advocates and Solicitors
2nd floor, Hague Building, SS Ram Gulam Marg, Ballard Estate, Mumbai 400 001
mansi.singh@btgadvaya.com

IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM – IV JUDICAIL MEDCHAL-MALKAJGIRI DISTRICT
AT: MEDIPALLY
O.S.NO. 129 OF 2026

Between:
N Rajitha & 2 others ....Plaintiffs 1 to 3
AND
The Tahsildar, Uppal Mandal & All concerned ...Defendants

To,
All Concerned,
Please take notice that the above name, Plaintiffs had filed the above suit for declaration of Legal Heirs of Late. N. Sateesh Kumar Goud. Therefore, All Concerned/Defendant No. 2 are here by informed that the above suit is coming up for appearance/objections if any to be filed in the above suit. If any person/persons having any right /claim or interest wat so ever they may do so by appearing either in person or through an advocate on 05-05-2026 at 10.30 am before the above-mentioned court failing which the matter will be decided as per law.
B. PREMHARI GOUD
G. MONICA
K. YADAGIRI
Advocates
Nirvana Law Chambers
#3-4-98/202, New Narasimha Nagar, Mallapur, Nacharam, Hyderadad-500076.
EmailiD:advocateprem1925@gmail.com
#9110770780, #996670044

IN THE COURT OF THE HON'BLE IIND ADDL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT
AT: L.B.NAGAR
O.S.No. 257 of 2026

Between:
1.EDULAKANTI SUDHARSHAN REDDY, S/o. Late Edulakanti Prathap Reddy, R/o. H.No.7-3-18/6, Reddy Colony, Bairamalguda, Vaishalinagar, karmanghat, Saroor Nagar, Ranga Reddy District.
2.EDULAKANTI MADHUSUDHAN REDDY, S/o. Late E.Pratap Reddy, R/o. H.No.7-1-4, Road No.3, Sai Ram Nagar Colony, Bairamalguda Village, Ranga Reddy District.
3.SMT MARRI SUNITHA, W/o. Marri Bhaskar Reddy, D/o. Late Edulakanti Prathap Reddy, R/o. H.No.17-1-382/R/18, 19-205 esternal Saraswathi Pride, APSRTC Colony, Champapet, Saroor Nagar, Vaisahalinagar, Ranga Reddy District.
... PLAINTIFFS
AND
1. The Tahsildar Saroor Nagar Mandal, Ranga Reddy District.
2. All Concerned.
...DEFENDANTS

To
All Concerned
Place take notice that the plaintiffs No. 1 to 3 filed the present suit seeking relief of declaration of the legal heirs of the deceased EDULAKANTI PRATHAP REDDY, he died on 18-01-2025, to grant legal heir certificate in favour of plaintiffs and the suit is posted on 06-05-2026 for appearance of the defendant for any filing objections or required to appear before the court of HON'BLE IInd ADDL JUNIOR CIVIL JUDGE, Ranga Reddy District, AT. L.B.Nagar, at about 10-30 A.M. either personally or through advocate which the material would be decided exparty.
"By Order of the Court"
Sd/- S.Murali Goud
MBA, LL.B., Advocate
H.No.6-54, Kandukur X Road, Kandukur (M) Ranga Reddy (D).
Cell No. 9948872977

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-VII A.M.M, MEDCHAL-MALKAIGIRI DIST., AT MEDCHAL.
E.P. No: 194 OF 2022
IN
ABR.CF NO: 23 OF 2019

Between:
M/s Kapil Chits (Hyd) Pvt. Ltd, JEEDIMETLA BRANCH, FJMT05J-9
.... Decree Holder
AND
Mr. M. Srinivasa Rao & Others
...Judgment-Debtors

To:
Jdr No:-2 Mr. Chandra Swamy Kalli, S/o Rama Chandra Rao K, Aged About 49 Years, Occ: Head Constable-508 Intelligence Dept Police Dept Govt Of Andhra Pradesh.
Jdr No:-3 Mr. Anna Rao Kamble, S/o. Limbaji K, Aged about 53 Years, Occ: Head Constable-620 Dept Intelligence Police Dept Govt Of Ap
Jdr No:-4 Mr. Shiva Shankar Vara Prasad Ravuri, S/o Yanadhi Rao, Aged About 41 Years Occ: Fitter Card No 2741 Ordinance factory Yeddumailaram Medak.
Whereas the above named Decree Holder has instituted a Execution Petition against you for recovery of money of Rs.18,843/- You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the 29-04-2026 at 10.30. AM failing which the matter will be decided exparte in accordance with law.
By order of the court.
J. Srinivas Reddy,
N. Vijay Kumar
K. Anusha,
Advocate's, Medchal.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-VII A.M.M, MEDCHAL-MALKAIGIRI DIST., AT MEDCHAL.
E.P. No: 97 OF 2022
IN
ABR.CF NO: 180 OF 2021

Between:
M/s Kapil Chits (Hyd) Pvt. Ltd. KUKATPALLY BRANCH, FKL29G-17
...Decree Holder
AND
Mr. V. Srikanth & Others
... Judgment-Debtors

To,
Jdr No:-1 Mr. Srikanth Voolla, S/O. V Laxman, Aged About: 32years, R/O. H.No.15-80, Gurumurthy Nagar Idpl Colony, Balanagar Quthbullapur, Hyderabad, Telangana.
Jdr No:-2 Mr. Mahesh Kumar Buyyani, S/O:Narsimulu B, Aged About 43 Years, R/O. H No.15-74, Gurumurthy Nagar, Quthbullapur, R.R. Dist, Telangana.
Jdr No:-3 Mr. Srinivas Rao Bankapalli, S/O:Lakshman Naidu B. Aged About 36 Years,
R/O. H No.87/23, Rajeev Gruhakalpa Suraram Colony, Quthbullapur, Hyd. Telangana.
Whereas the above named Decree Holder has instituted a Execution Petition against you for recovery of money of Rs.59,085/- You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the 29-04-2026 at 10.30. AM failing which the matter will be decided exparte in accordance with law.
By order of the court.
J. Srinivas Reddy,
N. Vijay Kumar
K. Anusha,
Advocate's, Medchal.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-VII A.M.M, MEDCHAL-MALKAIGIRI DIST., AT MEDCHAL.
E.P. No: 11 OF 2022
IN
AA.CF NO: 323 OF 2016

Between:
M/s Kapil Chits (Hyd) Pvt. Ltd. KPHB BRANCH, FKPL22F-27
...Decree Holder
AND
Mr. U. Rama Raju & Others
... Judgment-Debtors

To,
Jdr No:-2 K. Suresh Kumar Raju, S/o. Gopal Raju, a/a 2,3,47 yrs, Occ: Maintenance, Emp No. 2,3,40521, Deepak Nitrite Ltd., Unit II, Plot No. 70A & B, Phase I, IDA Jeedimetla, Hyd.
Jdr No:-3 Mr. K. Nageswara Rao, S/o. Bala Sundaram, a/a 2,3,42 yrs, Occ: Helper, Emp No. 0202,3,40, Deepak Nitrite Ltd., Unit II, Plot No. 70A & B, Phase I, IDA Jeedimetla, Hyd.
Jdr No :-4 Mr. Ch. Nagamalleshwara Rao, S/o. Pandu Ranga Rao, a/a 39 yrs, Occ: Helper, Emp No. 02069, Deepak Nitrite Ltd., Unit II, Plot No. 70A & B, Phase I, IDA Jeedimetla, Hyd
Whereas the above named Decree Holder has instituted a Execution Petition against you for recovery of money of Rs.34,399/- You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the 29-04-2026 at 10.30. AM failing which the matter will be decided exparte in accordance with law.
By order of the court.
J. Srinivas Reddy,
N. Vijay Kumar
K. Anusha,
Advocate's, Medchal.

ఆసరా కార్డులను సీనియర్ సిటిజన్స్ సద్వినియోగం చేసుకోవాలి

: డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్

అసరా కార్డులను అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

హుడాకాంప్లెక్స్,21 ఎప్రిల్, ప్రభాతవార్త : ప్రభుత్వం అందజేసే అసరా కార్డులను సీనియర్ సిటిజన్స్ సద్విని యోగం చేసుకొని రాయితీలు పొందాలని సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూ టీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనరేట్ పరిధి లోని సరూర్‌నగర్ సర్కిల్ (12) లో డిప్యూటీ కమిషనర్ ఛాంబర్‌లో మంగళవారం అయన సీనియర్ సిటిజన్‌లకు అసరా కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా డీసీ మాట్లాడుతూ ప్రతి సీనియర్ సిటిజన్ అసరా కార్డులను వినియోగించుకుని ప్రభుత్వం ద్వారా కలిగే సదుపాయాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్, యుసిడి సిబ్బంధి గుండు సహదేవ్, శోభన పాల్గొన్నారు.

ఎయిర్టెల్ టవర్‌ను తక్షణమే తొలగించాలి

తుర్కయంజాల్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త)

ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధి, ఏపీఏటీ కాలనీ రోడ్ నెంబర్ 2, కమ్మగూడలో ఏర్పాటు చేస్తున్న ఎయిర్టెల్ సెల్ టవర్‌కు వ్యతిరేకంగా కాలనీ వాసులు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కౌన్సిలర్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసిక ఐలయ్య ఆధ్వర్యంలో కాలని వాసులు, పెద్ద సంఖ్యలో పాల్గొని, జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు అంటూ నినాదాలు చేశారు. ఎయిర్టెల్ టవర్‌ను తక్షణమే తొల గించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. కోసికే ఐలయ్య మాట్లాడుతూ, నివాస ప్రాంతాల బిల్డింగులపై సెల్ టవర్లు ఏర్పాటు చేయడం వల్ల వెలువడే రేడియేషన్ ప్రభావం వలన చిన్నపిల్లలకు ,పెద్దలకు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి టవర్ల నిర్మాణం మరింత ప్రమాదకరమని పేర్కొన్నారు.ఇరుకైన ఇండ్ల మధ్య భారీ టవర్ నిర్మించడం వల్ల భవిష్యత్తులో నిర్మాణ పరమైన ప్రమాదాలు సంభవించే అవకాశముందని వారు తెలిపారు. గాలివానలు, తుఫానుల సమయంలో టవర్ పై పిడుగులు,మెరుపులు పడే అవకాశం ఉంది కాబట్టి ఇండ్ల మధ్యలో టవర్ ను తీసివేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఈ టవర్ నూ తీసివేయాలని , లేకపోతే మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏపీటిఏ కాలనీ అసోసియేషన్ మరియు పెద్దలు,మహిళలు, యువకులు పాల్గొన్నారు

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై బిజెపి ఫిర్యాదు

తుర్కయంజాల్ ఏప్రిల్21 (ప్రభాతవార్త)

బీజేపీ 53, 56 జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బిజెపి నాయకులు జిహెచ్ఎంసి తుర్కయంజాల్ పరిధిలోని వివిధ రెవిన్యూ గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అబ్దుల్లాపూర్మెట్ డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వానికి చెందిన విలువైన భూములు భూకబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు దుండగులు అక్రమంగా ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని, భవిష్యత్ తరాలకు చెందాల్సిన ఆస్తులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు ప్రజల సాధారణ ఉపయోగాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడాల్సినవని, కానీ వాటిని అక్రమంగా ఆక్రమించడం వల్ల సమాజానికి నష్టం కలుగుతోందని తెలిపారు. వెంటనే ఈ ఆక్రమణలను గుర్తించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసిల్దార్‌ను కోరారు.ఇకపై ఇలాంటి అక్రమాలు కొనసాగితే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కొత్త రామ్ రెడ్డి, బచ్చి గళ్ళ రమేష్, సనేం అర్జున్ గౌడ్, నందగిరి సురేష్, కోలన్ రవీందర్ రెడ్డి, గుండా కృష్ణ, ఎటెల్లి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

జన గణన కార్యక్రమంపై విస్తృతంగా శిక్షణ తరగతులు : డిసి భాస్కర్ రెడ్డి

సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ భాస్కర్ రెడ్డి, చిత్రంలో డిఇ వేణుగోపాల్ తదితరులు

మలక్ పేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: జన గణన కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ముసారాంబాగ్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సోలిపురం భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మలక్ పేట ముంతాజ్ కళాశాలలో ముసారాంబాగ్ సర్కిల్ 29 ఆధ్వర్యంలో 202627 సంవత్సరానికి సంబంధించి రెండవ బ్యాచ్ కు జనగణ శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. ముసారాంబాగ్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, జనగణన ఇన్చార్జి అధికారి సోలిపురం భాస్కర్ రెడ్డి సోలిపురం అధ్యక్షతన సూపర్వైజర్లకు, ఎన్యుమరేటర్లకు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో డిఇ వేణుగోపాల్ , ఎఇ వెంకన్నలతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లుతదితరులు పాల్గొన్నారు.

అవసరం లేని చోట ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దు

-ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

బాధితులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సైదాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: అవసరమైన చోట ఫ్లై ఓవర్ల నిర్మాణంనచేపట్టకుండా అవసరం లేని చోట ఫ్లై ఓవర్ల నిర్మాణంనచేపడుతున్న ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. టికెఆర్ కమాన్ నుండి ఓవైసి ఆసుపత్రి చౌరస్తా వరకు ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టనున్న నేపధ్యంలో ప్రస్తుతం ఉన్న 150 ఫీట్ల రోడ్డును 200 ఫీట్లకు వెడల్పు చేయాల్సి ఉందని, రోడ్డు పక్కన వ్యాపారులు తమ దుకాణాలను ఖాళీ చేయాలంటూ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో బాధిత దుకాణ దారులు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ..స్థానికంగా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకున్నా, ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టడం సరికాదన్నారు. ఇక్కడ ఫ్లై ఓవర్ అవసరం లేదని తాను ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ ఇవ్వడం జరిగిందన్నారు. అవసరం లేని చోట ఫ్లై ఓవర్ నిర్మాణం చేడుతూ దాదాపు 240 మందికి నోటీసులు ఇచ్చారని, ప్రజలను ఇలా రోడ్డున పడేయడం దారుణమన్నారు. తాము అభివృద్ధికి ఆటంకం కాదని, నిజంగా ట్రాఫిక్ సమస్య ఉన్న చోట ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపడితే స్వాగతిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య ఉన్న నాగోలు ఆనంద్‌నగర్ చౌరస్తా వద్ద, హస్తినాపురం నుండి బిఎన్ రెడ్డి వరకు ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపట్టడానికి తాను గతంలోనే డిపిఆర్ ప్రిపేర్ చేయించడం జరిగిందని, అయితే ప్రభుత్వం మారడంతో అది పెండింగ్‌లో పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే ఇక్కడ ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టుడు కన్నా కూలగొట్టుడే చేస్తున్నారని ఆయన విమర్శించారు. అందరికి సమన్యాయం అనే సిద్ధాంతానికి హైడ్రా కట్టుబడి ఉండాలని ఎమ్మెల్యే హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ముదుపు రాజిరెడ్డి, రవి ముదిరాజ్, ముద్ద కళ్యాణ్, సిహెచ్ యాదిరెడ్డి, రమాదేవి, కొత్తపేట ప్రభాకర్, తిరుపతిరెడ్డి, చందు, టవర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధరిత్రి దినోత్సవం సందర్భంగా విద్యార్థుల మెగా సైకిల్ ర్యాలీ

సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వనస్థలిపురం. ఏప్రిల్. 21.ప్రభాతవార్త

ధరిత్రి దినోత్సవం సందర్బంగా జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, జాగృతి ప్రతినిధులు పాల్గొన్న ఈ మెగా ర్యాలీని హయత్ నగర్ మండల విద్యా శాఖాధికారి కె.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సైకిల్ ర్యాలీ కేవలం పొల్యూషన్ తగ్గించడమే కాకుండా భూమాత సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ఒక్క సారి వాడి పారేసే ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, చెట్ల పెంపకం, సహజ ఎరువులుతో భూసారం పెంచడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని జాగృతి అభ్యుదయ సంఘం సైకిల్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు.పలు పర్యావరణ పరిరక్షణ నినాదాల ప్ల కార్డులను ప్రదర్శిస్తూ షుమారు 150మంది విద్యార్థులు పాల్గొన్న మెగా సైకిల్ ర్యాలీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం నుండి ప్రారంభమై రైతు బజార్, గణేష్ టెంపుల్, రెడ్ వాటర్ ట్యాంక్, సచివాలయ నగర్ ప్రాంతాల మీదుగా షుమారు 2 కిలోమీటర్లు కొనసాగింది. సైకిల్ ర్యాలీ ద్వారా యువత ప్రకృతి పరిరక్షణపై బాధ్యతను గుర్తు చేసిందని, జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ తెలిపారు.ర్యాలీ అనంతరం జాగృతి అభ్యుదయ సంఘం విద్యార్థులకు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.వి.దినేష్ ,ఇస్మాయిల్ గురుజి, జాగృతి ప్రతినిధులు శ్రీరంగనాథ్, యాదా రామలింగేశ్వర్ రావు, బచ్చనబోయిన యాదయ్య యాదవ్, ఎ.సత్యనారాయణ, నర్సింహులు, కె.వి.రమణయ్య, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నాగేశు,విద్యార్థులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో కూల్చివేతలు, అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులపై సమీక్ష

బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్-16 కార్యాలయంలో మంగళవారం మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. బడంగ్‌పేట్‌లో జరిగిన కోట్లాది రూపాయల భారీ అవినీతిపై ఇటీవల అనిశా (అవినీతి నిరోధక శాఖ), విజిలెన్స్ అధికారుల చేపట్టిన విచారణ అనంతరం డిప్యూటీ కమీషనర్ సరస్వతితో సహా మొత్తం పది మంది అధికారులపై జిహెచ్ఎంసి కమీషనర్ సస్పెన్షన్ వేటు వేసిన తర్వాత ఎమ్మెల్యే బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయానికి వచ్చి సమీక్షా సమావేశం జరగడం గమనార్హం. ఈ సందర్బంగా ఇటీవల సరస్వతి స్థానంలో కొత్తగా వచ్చిన డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య, వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష జరిపారు. ఇందులో భాగంగా ఫుట్‌పాత్ ఆక్రమణల పేరిట జరిగిన కూల్చివేతలపై ఆమె ఆరా తీశారు. పేదలు, మధ్యతరగతి వర్గాలకు చెందిన వ్యాపారులకు ఇబ్బందులు కలగడంపై ఆమె స్పందించారు. ఈ సందర్బంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. అంతనంర టెండర్లు అయినా ఇంకా ప్రారంభం కాని పలు అభివృద్ధి పనులు, అసంపూర్తి పనులు, జరుగుతున్న పనుల పురోగతి, పారిశుధ్య సమస్యలు, తాగు నీటి సమస్యలు తదితర అంశాలపై ఆమె సమగ్రంగా సమీక్ష జరిపారు. బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని డివిజన్లలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సబితారెడ్డి అధికారులు సూచించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి : టిఎస్ఎస్ఎ అధ్యక్షుడు మహేష్ కుమార్

సమావేశంలో ప్రసంగిస్తున్న తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్ కుమార్ తదితరులు

మలక్ పేట, ఏప్రిల్ 21,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళితుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్ కుమార్ పేర్కొన్నారు. మలక్ పేట లోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దళిత వర్గాలను నిర్లక్ష్యం చేయకుండా వారి కోసం కేటాయించిన నిధులను సంపూర్ణంగా వారికోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న దళితులకు కేటాయించిన నిధులు, దళిత విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని పేర్కొన్నారు. కేవలం దళిత బహుజనులని ఒక ఓటు బ్యాంకు విధంగా ప్రభుత్వం వాడుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి ఉత్సవాల పేరుతో ప్రచా రం చేయడం న్యాయమా అని ప్రశ్నించారు. ఎస్సీ సంక్షే మం కోసం కేటాయించిన బడ్జెట్లో ఏ రంగాల్లో ఖర్చు చేశా రో దానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలపాలని అన్నారు. స్కీమ్ బకాయిలను వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలని, ఈ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దని కోరారు. దళితుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళితుల సంక్షేమం కోసం ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్ట లేదని ఆవేదన వ్యక్తం చేశారు.దళితుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను వెంటనే వారి సంక్షేమం కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామర్ల సత్యనారాయణ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నిర్మల సతీష్ మహజన్, గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ కూరెళ్ల ఉదయ్ కుమార్, నాయకులు ధర్మారం శేఖర్,జిట్టా ఉదయ్,సాత్విక్, లెనిన్ పాల్గొన్నారు.

జల్‌పల్లి సర్కిల్‌లో మంచి నీటి ఎద్దడి, నివారణ చర్యలపై సమీక్ష

జలమండలి అధికారులో మంచి నీటి ఎద్దడిపై సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

సరూర్‌నగర్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి జల్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో మంగళవారం మంచి నీటి సమస్యలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సర్కిల్ డిప్యూటీ కమీషనర్ వెంకట్‌రామ్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై వేసవిలో మంచి నీటి ఎద్దడి, ప్రజల సమస్యలు, నివారణ చర్యలపై సమీక్ష జరిపారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీటి ఎద్దడిపై ప్రభుత్వం తగన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు చేపట్టినా సమస్యల పరిష్కారంలో ఎలాంటి మార్పులు రాలేదని ఆమె ఆరోపించారు. జల్‌పల్లి సర్కిల్‌లోని షాహిన్ నగర్, జల్‌పల్లి, పహాడీషరీఫ్ డివిజన్లలో మంచినీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయనీ వీటిపై తనకు ప్రతి రోజు ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేసున్నారని ఆమె వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో కనీసం వారానికి ఒక సారి కూడా నీటి సరఫరా కావడం లేదనే దానిపై ఫిర్యాదులు వస్తున్నాయని ఆమె తెలియజేశారు. ప్రస్తుతం ట్యాంకర్లపై ఆధారపడే దుస్థితి నెలకొందని ఆమె విచారం వ్యక్తం చేశారు. వేసవిలో మంచి నీటి ఎద్దడి సమస్యలు ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని ఆమె అన్నారు ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోకపోతే పరిస్థితి దారుణంగా ఉంటుందని ఆమె హెచ్చరించారు. నీటి కొరత, సమస్యలు ఉన్న ప్రాంతాల్లో మెరుగైన నీటి సరఫరా చేయాలని ఆమె ఆదేశించారు. పాత బోర్లను, పాడైన వాటిని గుర్తించి వాటిని వినియోగంలోకి తేవాలని ఆమె సూచించారు. భోజగుట్ట రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. హైదరాబాద్‌లో మాదిరిగానే జల్‌పల్లి సర్కిల్‌లో రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి షేక్ అప్జల్, నాయకులు ఖైసర్ బామ్, యూసుఫ్ పటేల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

దోమల సమస్యతో నాచారం ప్రజల ఇబ్బందులు

-హెచ్ఎంటీనగర్ పెద్ద చెరువు శుభ్రం చేస్తామని హామి

సమస్యను వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్

నాచారం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల పురోగతిని మంగళవారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులు, సుందరీకరణ ఏజెన్సీ అధికారి యూనస్ తమ సిబ్బందితో కలిసి చెరువు తూర్పు భాగమైన ఇందిరానగర్ వైపు పర్యటించారు. పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ సంఘటన స్థలానికి వెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చెరువులో పూర్తిగా గుర్రపు డెక్కన్ పేరుకుపోవడంతో తీవ్ర దోమల సమస్య ఏర్పడి నాచారం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే చెరువులోని నీటిని తొలగించి శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన అధికారులు, మరో వారం రోజుల్లో చెరువు ఖాళీ చేసే పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కట్ట బుచ్చన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ సర్కిల్‌లో జోనల్ కమిషనర్ రాధిక గుప్తా పర్యటన

ఉప్పల్ సర్కిల్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం జోనల్ కమిషనర్ రాధిక గుప్తా అధికారులతో కలిసి పర్యటించారు. ఉప్పల్ న్యూ భరత్‌నగర్ ప్రధాన రహదారి రోడ్డును ఎస్ఇ హరికిషోర్, డిఇ వెన్నెలగౌడ్, ఎఇ రాజ్‌కుమార్ తదితరులతో కలిసి పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం కాప్రా మరియు నాచారం సర్కిల్‌లలో అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్ రాధికా గుప్తా పరిశీలించారు. ఈసందర్భంగా రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రెయినేజీ, ఇతర మౌళిక వసతుల పనుల పురోగతిని సమీక్షించారు. పనులను నాణ్యత,నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సం బంధిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ బాబు,అధికారులు పాల్గొన్నారు.

అజ్మత్‌నగర్ కాలనీలో రోడ్డు పనులు : బన్నాల ప్రవీణ్

అజ్మత్‌నగర్ కాలనీలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : చిల్కానగర్ డివిజన్ అజ్మత్‌నగర్ కాలనీలో రూ.కోటి వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు, కల్వర్టు పనులను బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అజ్మత్ నగర్ కాలనీలో ఇరిగేషన్ నాలా పై రూ. కోటి వ్యయంతో నిర్మించిన కల్వర్టు పనులు, సిసిరోడ్డు పనులు పూర్తయ్యాయని తెలిపారు. మరో 15 రోజులలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. కళ్యాణపురి మీదుగా చిల్కానగర్ మరియు బోడుప్పల్‌కు వెళ్లే ప్రజలకు రోడ్డు వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కొక్కండ జగన్, ఎం. శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, బంటి గౌడ్, అజ్మత్ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు అతిశేష్ రాథోడ్, అమరేందర్ రెడ్డి, గోపాల్ రావు, హనుమంతు రావు, దామోదర్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి గందె సుధాకర్, చిత్రంలో ఉప్పల రాజ్యలక్ష్మి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి గందె సుధాకర్, నాగరాజు అయ్యగారు పేర్కొన్నారు.ఆర్కేపురం డివిజన్ వాసవీకాలనీలో ఐవీఎంఎస్(ఇంటర్నేషనల్ వాసవీ మహిళా సమాఖ్య) సంఘా వ్యవస్థాపక అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం 139వ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గందె సుధాకర్, నాగరాజు అయ్యగారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ పార్లమెంటులో మహిళా బిల్లు వీగిపోవడం బాధాకరమన్నారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం లభించినట్లు అన్నారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సాధికారత కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ రంగాలలో సమాజసేవలో రాణిస్తున్న మహిళలను వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సృజన, సంతోషి, వాసవీ, ఝాన్సీ, మౌనిక, శోభ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కళ్యాణం లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ మేరు, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోల్కం వినయ్ రాజ్, పోరెశెట్టి అభినవ్ కుమార్, కొత్త బాలరాజ్ తదితరులు.

భక్తిశ్రద్ధలతో శ్రీ లక్ష్మీ నారాయణ కళ్యాణ మహోత్సవం

అభిషేకం చేస్తున్న పురోహితులు

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: అష్టలక్ష్మి దేవాలయంలో శ్రీలక్ష్మీనారాయణ కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగ నిర్వహించారు. ఆర్కే పురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో జరుగుతున్న 30వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని వేలాది మంది భక్తులకు ఉదాహరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సుప్రభాత సేవ, బాలభోగ మంగళాశాసనము, తీర్థప్రసాదగోష్ఠి, హయగ్రీవఇష్టి, నిశాచూర్ణోత్సవము(పసుపు కొట్టుట) ఉత్సవమూర్తులకు అభిషేకము, హనుమత్ వాహనసేవ, శ్రీశంకరభగవత్పాదుల జయంతి సందర్భంగా అర్చన, నిత్యపూర్ణాహుతి, ఇష్టియాగశాలలో పూర్ణాహుతి, మంగళాశాసనము, తీర్థప్రసాద వినియోగము, శ్రీవిష్ణుసహస్రనామస్తోత్ర పారాయణ, యాగశాలలో నిత్యహోమాలు, గరుడవాహనసేవ, దొపోత్సవము, అశ్వవాహనసేవ తదితర కార్యక్రమాలను వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలి

మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

దివంగత రామకృష్ణారెడ్డి తల్లిదండ్రులను, భార్య కూతుళ్ళను, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: దివంగత బిజెపి నేత రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి కోరారు. ఇటీవల అకాల మృతి చెందిన బడంగ్‌పేట్ సెక్టార్-1 బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను మంగళవారం ఆమె పరామర్శించారు. బడంగ్‌పేట్‌లోని వారి నివాసానికి వచ్చిన ఆమె రామకృష్ణారెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి, తల్లి శారద, భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్ళను పరామర్శించారు. ఈ సందర్బంగా ఆమె మాటాడుతూ రామకృష్ణారెడ్డి మరణం చాలా బాధాకరమనీ ఈ మేరకు కుటుంబ సభ్యులు ఆత్మస్థైర్యంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాళ్ళగూడెం మల్లారెడ్డి, రాళ్ళగూడెం బల్వంత్‌రెడ్డి, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, పెద్దబావి మహేందర్‌రెడ్డి, గుర్రం వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి నీటి చుక్కను కాపాడుకోవాలి : ఎమ్మెల్సీ

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, విజయరంగ

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: ప్రతినీటి చుక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ బొగారపు దయానంద్‌గుప్తా పేర్కొన్నారు. నీటి సంరక్షణకు సంబంధించి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు 196 దేశాలలో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో భాగంగా అంతర్జాతీయ అధ్యక్షుడు అరవింద్‌పాల్‌సింగ్, అరవెల్లి అమర్‌నాథ్ మార్గదర్శకంలో కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల నగరవాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెంగళూరు లాంటి నగరంలో నీటి సమస్య తలెత్తినప్పుడు వారు పడ్డ ఇబ్బందులు అందరు గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి నీటిబొట్టు కాపాడే విషయంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ బి.విజయరంగ, జిల్లా చైర్మన్ అన్యం కోటిరెడ్డి, జలమండలి ఏఈ ప్రశాంతిరెడ్డి, మేనేజర్ గురునాథం, జీవనది ఫౌండేషన్ చైర్మన్ ఇంటి లక్ష్మీదుర్గ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో ఘనంగా ఆది శంకరాచార్య జయంతి

ఆదిశంకరాచార్య జయంతిని నిర్వహిస్తున్న సర్వ విదానంద సరస్వతి స్వామీజీ

సరూర్‌నగర్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్‌లో మంగళవారం జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని ఘనంగా నిర్వహించారు. శంకర పీఠం వశిష్ట ఆశ్రమం ఆధ్వర్యంలో స్వామి సర్వ విదానంద సరస్వతి స్వామీజీ ఆదిశంకరాచార్యుల వారి జయంతిని జరిపారు. ఈ సందర్బంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి సత్సంగం చేశారు. ఇందులో భాగంగా ఆదిశంకరాచార్యుల జీవిత విశేషాలు, ఆయన గొప్పతనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు గునుగంటి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జల్‌పల్లి శ్రీరామ కాలనీలో అవగాహన

సరూర్‌నగర్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త: పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జల్‌పల్లి శ్రీరాం కాలనీలో మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక సింఘానియా ఫుడ్స్ ఇంటర్నేషనల్ సంస్థలో జరిగిన ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల గురించి వివరించారు. ఇందులో భాగంగా ఫేక్ లింకులు, కాల్స్, ఓటిపిల షేరింగ్, పాస్‌వర్డ్‌లు తదితర విషయాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిటిటల్ అరెస్టులు ఉండవనీ ఎవరైనా ఫోన్ చేస్తే సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.ఇంకా పలు సైబర్ మోసాలను వివరించి అప్రమతనంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింఘానియా సంస్థ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినీ నటుడు ప్రకాష్ రాజ్ పై ఫిర్యాదు

ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు.

వనస్థలిపురం. ఏప్రిల్. 21.ప్రభాతవార్త : సినీ నటుడు ప్రకాష్ రాజ్ పై చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం ఇన్స్పెక్టర్ రవి బాబు కు శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం పిర్యాద చేశారు. కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో శ్రీరాముడు పై సినీ నటుడు ప్రకాష్ రాజ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు చేశాడని,ప్రకాష్ రాజ్ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ ప్రతినిధులు ఇన్స్పెక్టర్ ను కోరారు. పిర్యాదు చేసిన వారిలో ఆలయ కమిటీ చైర్మన్ ఎం.వి.మని శేఖర్,అధ్యక్షుడు జి.అంజయ్య,ప్రధానకార్యదర్శి పురుషోత్తం, కోశాధికారి ఉప్పు వెంకటేష్,సభ్యుడు సేనయ్య తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల హిల్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు వినతి

నేరెడ్ మెట్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త : శామీర్‌పేట్ డివిజన్ పరిధిలోని జర్నలిస్టుల హిల్ కాలనీలో మౌలిక సదుపాయాల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక జర్నలిస్టులు మల్కాజ్గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.శామీర్‌పేట్ డివిజన్‌లోని రిజిస్ట్రేషన్ నెంబర్ 53/26, సర్వే నెంబర్ 1239/2 పరిధిలో ఉన్న జర్నలిస్టుల హిల్ కాలనీలో మౌలిక వసతుల కల్పన కోసం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మల్కాజ్గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలను వివరించిన వారు, రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, విద్యుత్ దీపాలు వంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ వినతిపై స్పందించిన జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, సమస్యలను స్వయంగా పరిశీలించేందుకు కాలనీకి వచ్చి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల హిల్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గడ్డమీది యాదగిరి, వైస్ ప్రెసిడెంట్ జార్జి విల్సన్ బండారి, ప్రధాన కార్యదర్శి బొమ్మెట్ట శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, సభ్యులు దేశం కృష్ణతో పాటు ఉప్పల్ మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి,మల్కాజ్గిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్. బాలరాజు, ప్రధాన కార్యదర్శి విశాల్, గోపాల్, సంగమేష్, నందీశ్వర్, రాములు, గణేష్,మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.